జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ. 5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 7 సంచిక 290 | హైదరాబాద్, డిసెంబరు 30 శనివారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## పెట్టుబడులే లక్ష్యంగా...

# రేవంత్ తొలి విదేశీ పర్యటన

## జనవరిలో దావోస్ కు పయనం



హైదరాబాద్ : తొలిసారి రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. జనవరి నెలలో ఆయన స్విట్జర్లాండ్ పర్యటనకు వెళ్లనున్నారు. జనవరి 15-19 మధ్య దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ సదస్సులో భాగంగా ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈవోలతో సీఎం సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే అవకాశాలు, ప్రయోజనాల గురించి వారికి వివరించనున్నారు. తెలంగాణ ఇప్పటికే పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టగా, ఆ కంపెనీల ప్రతినిధులతో తెలంగాణ ప్రతినిధి బృందం భేటీ కానుంది. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు. ఇది ఇలా ఉంటే , వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో వంద దేశాలకు చెందిన రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు పాల్గొంటారు. ఈసారి ల్యాబ్ నుంచి లైఫ్ టు లైఫ్ - సైన్స్ ఇన్ యాక్షన్ అనే అంశంతో ఐదు రోజుల పాటు సమావేశాలు జరగనున్నాయి. ఈ సదస్సులో మన దేశంలోని కేంద్రమంత్రులతో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, అధికారులు కూడా పాల్గొంటారు. గత పదేళ్లలో హైదరాబాద్ నగరం ఎంతో అభివృద్ధి చెందింది. చాలా కంపెనీలు నగరంలో కార్యాలయాలు ప్రారంభించి భారీగా పెట్టుబడులు పెట్టాయి. ఈ అభివృద్ధిని కొనసాగించాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వానిదే. నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# నేడే ఆల్ తెలుగు ప్రజా పార్టీ ఆవిర్భావ సభ...




విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి):అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే దృఢ సంకల్పంతో, బీసీ ని ముఖ్యమంత్రిని చేయాలనే తలంపుతో,ప్రతీ కుటుంబాన్ని ఆర్థికంగా అత్యున్నత స్థితిలో నిలబెట్టాలని,అవినీతి రహిత పాలన అందించడవే లక్ష్యంగా ప్రజల ముందుకు వస్తున్న ఆల్ తెలుగు ప్రజాపార్టీ ఆవిర్భావ సభ నేడు విజయవాడలోని హ్యాపీ రిసార్ట్లో 10లక్షల సభ్యత్వంతో అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ సభకు రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్. అంబేద్కర్ మనవడు హాజరు కానుండగా పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కటికల శివ భాగ్యారావు ప్రజలందరికీ ప్రగతి వరాలు కురిపించనున్నారు. ముఖ్య అతిథులుగా ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డా. భీమ్ రావ్ యశ్వంత్ అంబేద్కర్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రెసిడెంట్, హైకోర్టు అడ్వకేటు బషీర్ అహ్మద్,అభ్యుదయ వాది కలిదిండి విశ్వనాథరాజు, ఆల్ ఇండియా సర్వోదయ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లనపల్లి, అగ్ని(వన్నియ) కులక్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివ రావు,యాదవ కమ్యూనిటీ జె.ఏ.సి స్టేట్ ప్రెసిడెంట్ మద్దుల వెంకట కోటయ్య యాదవ్,యానాది సేవ సంఘము ప్రధాన కార్యదర్శి శ్రీమతి బాదూరు సావిత్రమ్మ,రెల్లి మేధో వేదిక.ఏపీ ఎస్ సి,ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ ఉద్యోగులు,ప్రొఫెషనల్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వడ్డాడి అప్పల రాజు ఐ ఆర్ ఎన్ ,ద్రవిడదేశం పార్టీ అధ్యక్షుడు వి. కృష్ణారావు యాదవ్,శ్రీమతి వై. సంధ్య, డి.జి.ఎమ్ రిటైర్డ్ ఎచ్.పి.సి. ఎల్‌నేషనల్ జనరల్ సెక్రటరీ (స్నేహ క్లబ్) కె.వి.లు హాజర వుతుండగా పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కటికల శివ భాగ్యారావు తో పాటు పార్టీ నాయకులు డా.కందుల చందు యాదవ్, డా.పి. పరమ శివన్, నమ్మి అప్పారావు యాదవ్, అవుదలపురం బలరాం,ఎన్.కె. కరీముల్లా,బి.రాజేశ్వర రావు, కె. రవి కుమార్,జి. ఉమా మహేశ్వర రావు,ముండ్లపాటి పిచ్చయ్య లు అందరినీ ఆహ్వానించనుండగా,ఈ సభకు పార్టీలో సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, బహుజన వాదులు, కుల సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు.



## 50 ఏళ్లకే ఓల్డేజ్ పెన్షన్: జార్ఖండ్ సీఎం

రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఇవాళ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ తీసుకునే వారి వయసు పరిమితిని తగ్గించారు. పెన్షన్ అర్హత వయసును 60 ఏండ్ల నుంచి 50 ఏండ్ల వరకు తగ్గిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం సోరెన్ తెలిపారు. ఇక నుంచి 50 ఏండ్లు దాటిన వారు కూడా ఓల్డేజ్ పెన్షన్ అందుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే కంపెనీల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

# అసోంలో శాంతికి బీజాలు..


## కుదిరిన త్రైపాక్షిక శాంతి ఒప్పందం



అసోం: అసోంకు చెందిన ఉల్ఫా తీవ్రవాదుల గ్రూప్‌తో కేంద్రం చారిత్రాత్మక ఒప్పందం చేసుకుంది. ఉగ్రవాదానికి ఫుల్‌స్టాప్ పెట్టే రీతిలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్రవాద సంస్థ ఉల్ఫాతో త్రైపాక్షిక శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యాలయంలో జరిగిన చర్చల్లో హోంశాఖ మంత్రి అమిత్‌షా , అసోం సీఎం హిమంత బిశ్వా శర్మ పాల్గొన్నారు. 30 మంది ఉల్ఫా నేతల ప్రతినిధుల బృందం ఈ శాంతి చర్చల్లో పాల్గొంది.అసోంలో 1979 నుంచి ఉల్ఫా సంస్థ తీవ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటోంది. ప్రత్యేక అసోం దేశం కోసం ఈ సంస్థ పోరాటం చేస్తోంది. ఉల్ఫాతో శాంతి ఒప్పందంతో ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యంగా అసోంలో శాంతి నెలకొంటుందన్నారు హోంశాఖ మంత్రి అమిత్‌షా. చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం కేంద్ర హోంశాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తుందన్నారు.నరేంద్ర మోదీ 2014లో ప్రధాని పగ్గాలు చేపట్టాక ఈశాన్య రాష్ట్రాలు , ఢిల్లీ మధ్య దూరం తగ్గిందన్నారు అమిత్‌షా. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. "ఉల్ఫాతో శాంతిచర్చలతో ఈశాన్యంలో ముఖ్యంగా అసోంలో కొత్త చరిత్ర ప్రారంభమవుతుంది. భారత ప్రభుత్వంపై నమ్మకం పెట్టుకోవాలని ఉల్ఫా నేతలను కోరుతున్నా..(మిగతా 2లో..)

# ఉత్తర భారతాన్ని చుట్టుముట్టిన పొగమంచు..

## రైళ్లు, విమానాలు రద్దు



ఢిల్లీ: చలికాలం పైగా వాయు కాలుష్యం దీంతో ఉత్తర భారతదేశం పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఇవాళ ఉదయాన్నే దేశంలోని చాలా ప్రాంతాలు మంచుదుప్పటిని కప్పుకున్నాయి. దీని ప్రభావంతో డజన్లకు పైగా రైళ్లు, విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరికొన్ని రద్దు అయ్యాయి. జనవరి 2 వరకు ఉత్తర భారత రాష్ట్రాలలో దట్టమైన పొగమంచు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. చలిసైతం అలాగే వణికిస్తుందని తెలిపింది.(మిగతా 2లో..)




# అవినీతి నిజం..

## 50 టిఎంసి నీళ్లకు లక్ష కోట్ల ఖర్చా.. బిఆర్ఎస్ ను నిలదీసిన మంత్రులు ..



మేడిగడ్డ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అక్కడికి చేరుకున్నారు. అనంతరం హెలికాప్టర్ లో మేడిగడ్డ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. మేడిగడ్డ ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవడం, బ్యారేజీ వంగడం, పిల్లర్లు పగలడం, అన్నారం బ్యారేజీలో సిపేజ్లు ఏర్పడడం, ప్రాజెక్టు డిజైన్ లోపాలు వంటి పలు అంశాలు రాష్ట్ర ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అక్టోబర్ 21న మేడిగడ్డ పిల్లర్ కుంగింది, నవంబర్ 30 న ఎన్నికలు జరిగితే, డిసెంబర్ 3న ఫలితాలు వచ్చాయి. డిసెంబర్ 7వరకు కేసీఆర్ సీఎం గా ఉన్నారని. కానీ కాళేశ్వరం పై ఒక్కసారి మాట్లాడలేదని, ఇది చాలా సిగ్గుపడాల్సిన సంఘటన అని, అన్ని విషయాలు నిర్ధారణ చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం పై మా పార్టీ విధానం ఒకటే.. ప్రాణహిత చేవెళ్ల ని 35 వేల కోట్లతో నిర్మించాలి అనేది మా విధానం అన్నారు. కానీ ప్రాజెక్టు కట్టే పనిలో ఉండగా ప్రభుత్వం మారిందన్నారు. మా ప్లాన్ మార్చేసి.. ప్రాజెక్టు లొకేషన్ బీఆర్ఎస్ మార్చిందని అన్నారు. పదేళ్ళలో ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. 35 వేల కోట్ల తో మేము కట్టాలి, . కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లకు ఖర్చు పెరిగిందన్నారు. కాళేశ్వరం ప్రారంభం నుంచి మాకు అనుమానాలు ఉన్నాయన్నాయని అన్నారు. నిజానిజాలన్నింటినీ మీడియా కు వెల్లడిస్తామని, మూడేళ్లలో ఈ ప్రోజెక్ట్ కుంగటం సిగ్గు చేటని, దీన్ని ఎవరు నిర్మించారో వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో వడ్డీల భారం తప్పితే ఎలాంటి ప్రయోజనం లేదు. (మిగతా 2లో..)





కెకెఆర్ఎం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సెల్‌వెల్ కార్పోరేషన్ బండారు సుబ్బారావు సహకారంతో వృద్ధుల సేవా ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన కెకెఆర్ఎం సంస్థ అధినేత కుసుమ భోగరాజు

# అవినీతి నిజం..

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే కాళేశ్వరంపై జ్యుడిషియల్ ఎంక్వైరీ వేస్తాం" అని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం తుగ్లక్ చర్యే... కోమటిరెడ్డి వెంకట రెడ్డి.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసలు ఇంజినీర్ల సలహాలు తీసుకున్నారా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్టులను ఇంజినీర్ల సలహాలు తీసుకొని కట్టారా? లేక కేసీఆరే స్వయంగా చీఫ్ ఇంజినీర్‌గా డిజైన్ చేశారా? ప్రజలకు తెలియాలన్నారు. సాధారణంగా కిందకు వెళ్లే నీటిని బ్యారేజీ కట్టి పైకి తీసుకు వచ్చి మళ్లీ కిందకు వదలడం తుగ్లక్ చర్య అన్నారు. అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్ చూసిన తర్వాత ఆశ్చర్యం వేసిందన్నారు. అసలు ఇలాంటి ప్రాజెక్టు కట్టమని చెబితే మీరు (ఇంజినీర్లు, అధికారులను ఉద్దేశించి) సెలవు పెట్టి వెళ్లవలసింది. అని సూచించారు. అసలు ఏం పిచ్చి ప్రాజెక్టు ఇది అని వ్యాఖ్యానించారు. అసలు ఇక్కడ మూడో టీఎంసీ అవసరమే లేదన్నారు. ముఖ్యమంత్రి అయినా మంత్రులు అయినా ఎవరు ఉన్నా ప్రజల కోసం ఇంజినీర్లు తప్పును తప్పుగా చెప్పాల్సిందే అన్నారు. మీరు ప్రజలను కాపాడాల్సిన వారు అని ఇంజినీర్లతో అన్నారు. ప్రాణహిత, గౌరవెల్లి ప్రాజెక్టులు పూర్తి చేస్తే కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో వాటిని పక్కన పెట్టారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి పరిస్థితి ఉంటే అధికారులు సెలవు పెట్టి వెళ్లాలన్నారు.

కొండపోచమ్మ ఎప్పటికీ నీరు ఉంటుందని కానీ అక్కడి నుంచి ఫామ్ హౌస్‌కు తప్ప ఎక్కడకూ నీరు వెళ్లడం లేదన్నారు. ఇంత ఖర్చు చేస్తే అసలు ఎంత ఆయకట్టుకు నీరు వచ్చింది? అని ప్రశ్నించారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం కోసం ఎంత విద్యుత్‌ను ఉపయోగించారు? అని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గత ప్రభుత్వం ఎందుకు స్పష్టతను ఇవ్వలేకపోయిందన్నారు. రైతులకు వీటికి సంబంధించి స్పష్టమైన సందేశం పంపించాల్సి ఉందన్నారు.

**తప్పు ఎలా జరిగిందో ప్రజలకు తెలవాల్సిందే: దుద్దిళ్ల**

తమకు ఎవరి మీద వ్యక్తిగత కోపం లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. అసలు తమ వద్ద మూడు బ్యారేజీలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని తాగు, సాగునీటికి ఇబ్బంది అవుతోందన్నారు. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడం%ాా% అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో బుడగలు రావడం తెలిసిందేనని ఈ క్రమంలో ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఏం జరిగిందో తెలుసుకోవాల్సి ఉందన్నారు.

**50 టిఎంసి నీళ్లకు లక్ష కోట్లు ఖర్చా.. పొంగులేటి..**

గత ప్రభుత్వం నిర్మాణంలో రూల్స్? పాటించనందుకే కుంగి పోయిందని మంత్రి పొంగులేటి అన్నారు. టాప్ లాగ్ గేట్స్ పనిచేయకపోయినందుకే కుంగిపోయిందన్నారు. తన మార్కు కనిపించాలనే ఉద్దేశంతోనే మేడిగడ్డ బ్యారేజ్? ను నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్ట్? ఖర్చు ప్రతి పైసా కూడా అప్పు చేసి గత ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇప్పుడు ఆ సొమ్ముకు మార్కెట్? రేటు కంటె 12 శాతం ఎక్కువ వడ్డీ కడుతున్నామ్నారు.

లక్ష కోట్లతో 50 టీఎంసీలు ఎత్తిపోస్తున్నారున్నారు. మేడిగడ్డ నష్టాన్ని ఏజన్సీతో కట్టిస్తారా లేదా అని బీఆర్?ఎస్? నేతలను ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రజలపై ఎంత భారం పడుతుందో ఆలోచించలేదన్నారు. ఇది ఒక్క పిల్లర్? తో ఆగేదని కాదన్నారు. కాళేశ్వరం డ్యామేజ్ కావడం దురదృష్టకరమన్నారు. లక్షల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులకు బిల్డర్లదే బాధ్యత అని అన్నారు. ఇంత భారీ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను బయటపెడతామన్నారు. మేడిగడ్డలో పిల్లర్లు కుంగిపోవడంతో నీటిని నిల్వ చేసుకోలేకపోతున్నారు. నదిలో నీటిని దిగువకు విడుదల చేయాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్? నిర్మాణంలో గత ప్రభుత్వ హయాంలో 67 వేల 406 కోట్ల రూపాయిల అవినీతి జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మేడిగడ్డలో నీరు నిల్వ చేస్తే నీళ్లు నిల్వ చేసిననప్పుడు ఊళ్లు ముంపునకు గురవుతున్నాయి. కాళేశ్వరం అవినీతిని వెలికితీస్తామని అన్నారు. ప్రాజెక్ట్ పై రూపాయి ఖర్చు చేస్తే 50 పైసలు రాబడి మాత్రమే ఉందన్నారు. భారీ వర్షాలకు పంప్? హౌస్? లు ముంపునకు గురయ్యాయన్నారు. సాంకేతిక లోపం ఎవరి నిర్ణయాల వల్ల వచ్చిందని ప్రశ్నించారు. 3వ టీఎంసీ పనులను నామినేషన్? పై ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

## అసోంలో శాంతికి బీజాలు..

(మొదటి పేజీ తరువాయి)

మీ డిమాండ్ల అమలుకు కేంద్ర హెూంశాఖ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తుంది. నిర్ణీత గడువులో మీ డిమాండ్లు నెరవేర్చేవిధంగా చర్యలు ఉంటాయి" అని అమిత్ షా పేర్కొన్నారు. అయితే ఈ చర్చలకు పరేశ్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా స్వతంత్ర గ్రూపు దూరంగా ఉంది. అక్రమ వలసలు, తెగలకు భూమి హక్కులు, అసాం అభివృద్ధి కోసం ఆర్థిక ప్యాకేజీ లాంటి సమస్యలు ఈచర్చలతో కొలిక్కి వచ్చే ఛాన్సు ఉంది. దశల వారీగా ఉల్ఫా డిమాండ్లను తీరుస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఆఫ్స్పా లాంటి ప్రత్యేక చట్టాలను తొలగించామని, దీని ఉద్దేశం అస్సాంలో తిరుగుబాటు తగ్గినట్లే అవుతుందన్నారు. త్వరలోనే ఉల్ఫా కార్యకర్తలు క్యాంప్‌లను విడిచి జనజీవన స్రవంతి లోకి వస్తారన్నారు అసోం సీఎం హిమంత బిశ్వా శర్మ.

## ఉత్తర భారతాన్ని చుట్టుముట్టిన పొగమంచు..

(మొదటి పేజీ తరువాయి)

ఇవాళ పంజాబ్, హరియాణా, ఢిల్లీలో పొగమంచు కారణంగా రెడ్ అలర్ట్, శనివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. డిసెంబర్ 31న పంజాబ్‌కు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. జనవరి 2 వరకు పలు రాష్ట్రాలకి ఎల్లో అలర్ట్ జారీ అయింది. దట్టమైన పొగమంచు పరిస్థితులు రవాణా సేవలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఢిల్లీ-హౌరా మార్గంలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సహా డజన్ల కొద్దీ రైళ్లు 10 - 12 గంటలపాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. విమాన కార్యకలాపాలు కూడా పొగమంచుతో ప్రభావితమయ్యాయి. నోయిడాలో రానున్న రెండు రోజులపాటు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం అర్ధరాత్రి దాదాపు విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోయింది.

రోడ్డు ప్రమాదాలు..

మంచుదుప్పటి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. ఉత్తరప్రదేశ్ లో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 6 మరి మృతి చెందగా.. 12 మంది గాయపడ్డారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రజా పాలన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ

కారేపల్లి డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి: ఖమ్మం: కారేపల్లి మండలం రావోజితండా, సూర్య తండ గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయ అస్తం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా పాలన గ్రామసభలో నాబ్ తహసిల్దార్ లక్ష్మి అధ్యక్షతన దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎస్ పుష్ప, ఐకెపి సీసీ చైతన్య రెండు గ్రామపంచాయతీలో ప్రజల నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా పాలన అభయ హస్తం సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.



రావోజితండా గ్రామపంచాయతీలో 150 దరఖాస్తుదారుల నుండి, సూర్య తండ 417 దరఖాస్తుదారుల నుండి గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజా పాలనలో కొత్త రేషన్ కార్డు దారులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజా పాలన గ్రామసభలో రావోజితండా గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్నటువంటి అభయ హస్తం సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేసేందుకు ప్రజా పాలనలో తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, కారేపల్లి టౌన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు తాజుద్దీన్, సర్పంచ్ నాగేశ్వరరావు, బాలు నాయక్, రవి ,వినోద్ ,రాందాస్ పాల్గొని ప్రజలకు అభాయ హస్త గ్యారెంటీలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన అభయ హస్తం గ్యారెంటీలు ప్రతి ఒక్కరు అందజేస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు దరఖాస్తులు స్వీకరించి అనంతరం సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేయాలనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని తెలియజేశారు. ఈ ప్రజా పాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారులు వారి దగ్గర ఏ పత్రాలు అయితే ఉన్నాయో వాటిని జత చేసి సమర్పించి అధికారులకు అందజేయాలని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని దరఖాస్తులు సమర్పించిన ప్రతి అంశానికి అర్హులైన వారు టిక్ మార్క్ తో వినియోగించుకోవాలని అన్నారు. దరఖాస్తు ఫారం అందు తెల్ల రేషన్ కార్డ్, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తును అధికారులకు సమర్పించాలని అన్నారు. గ్రామ సభలో అందజేనివారు ఎంపీడీవో కార్యాలయం ముందు అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాబ్ లక్ష్మి, ఐకెపి సీసీ చైతన్య, ఐ డి సి ఎస్ పుష్ప, తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు తాజుద్దీన్, సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులు కుటుంబాలకు అందిస్తున్న అంగన్వాడీ టీచర్, గ్రామపంచాయతీ సిబ్బంది



కారేపల్లి డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి: ఖమ్మం :కారేపల్లి గ్రామపంచాయతీ అంబేద్కర్ నగర్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలన అభయ హస్త గ్యారంటీ హామీల దరఖాస్తులు పంపిణీ చేసిన అంగన్వాడి టీచర్ లక్ష్మి, గ్రామపంచాయతీ సిబ్బంది గౌతమ్ పాల్గొని కుటుంబాలకు దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ దరఖాస్తు ఫారాలు ప్రతి కుటుంబానికి అందజేస్తామని అన్నారు. దరఖాస్తు ఫారాలు అందని వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా దరఖాస్తులు తామే స్వయంగా అందరికీ అందిస్తామని తెలిపారు. దరఖాస్తు తీసుకున్న ఫారాలను కుటుంబ వివరాలు తెలియచేసి దరఖాస్తు ఫారం కు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి ప్రజాపాలన గ్రామసభలో అధికారులకు అందజేయాలని తెలిపారు.

## తెలంగాణ ప్రదేశ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా సన్మానించిన టి.ఎస్.టి.డి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్



కారేపల్లి డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి: టి ఎస్ టి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ నాయక్ తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర ఇన్కమ్ టాక్స్ కమిషనర్ను లావుడియా జీవన్ లాల్ ను మర్యాదపూర్వకంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ సెక్రెటరీ హనుమంతు నాయక్ శాల్వాతో ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం వారి గృహంలో ఏర్పాటు చేసిన తేనేటి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు సమస్యలపై తెలంగాణ ప్రదేశ్ కమిషనర్ తో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్, హనుమంతు నాయక్, ఆలయ చైర్మన్ ఐలయ్య, ఇల్లందు ఏఎంసి డైరెక్టర్ నరేష్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అజ్మీర వీరన్న, మండల కోఆప్షన్ సభ్యులు హనీఫ్, రవీందర్ నాయక్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ డివిజన్ మీదుగా మాల్దా టౌన్ - బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ని జెండా ఊపి ప్రారంభం చేయనున్న ప్రధాని

**నూతన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దక్షిణ మధ్య రైల్వేలోని పదకొండు స్టేషన్లలో స్టాపే అందించబడింది**





హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : భారత ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబర్ 30 , 2023న అయోధ్య నుండి రిమోట్ వీడియో లింక్ ద్వారా దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ మీదుగా మాల్దా టౌన్ - ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినస్ ( బెంగళూరు) అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ ప్రారంభోత్సవ రైలును జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు. అయోధ్యలో జరిగే కార్యక్రమంలో ప్రధాని దేశంలోని సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లలో కొత్త కేటగిరీ-అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్-ని జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మరియు రైల్వే అధికారులు కూడా పాల్గొంటారు. అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ ప్రవేశం దేశంలో రైలు ప్రయాణాన్ని ఆధునీకరించడంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. వినూత్నమైన పుష్-పుల్ విధానం ప్రయాణీకులకు వేగం, సామర్థ్యం, సౌకర్యం మరియు స్థోమత యొక్క ప్రత్యేక సమ్మేళనాన్ని అందిస్తుంది. మొదటి ప్రయత్నంలో రెండు కొత్త రైళ్లు ప్రవేశపెట్టబడుతున్నాయిబీ అయోధ్య ధామ్ జం. - దర్భంగా మాల్దా టౌన్-బెంగళూరు. ఇవి రద్దీగా ఉండే మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులకు నిరంతరాయ మరియు ఆనందించే ప్రయాణాన్ని అందిస్తాయి. నూతన అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుండా వెళుతుంది మరియు దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ మీదుగా పదకొండు స్టేషన్లలో స్టాప్ అందించబడింది. ఇందులో తుని , సామర్లకోట , రాజమండ్రి, ఏలూరు , విజయవాడ, తెనాలి , చీరాల , ఒంగోలు , నెల్లూరు, గూడూరు మరియు రేణిగుంట మొదలైన రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఈ రైలు విభాగంలోని ప్రయాణీకులకు వేగవంతమైన, అనుకూలమైన, సురక్షితమైన మరియు అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణ ఎంపికను అందిస్తుంది. రైలు ప్రయాణికులకు అందమైన మరియు ఆకర్షణీయమైన డిజైన్ సీట్లు, మెరుగైన లగేజీ ర్యాక్, తగిన మొబైల్ హెూల్డర్‌తో మొబైల్ ఛార్జింగ్ పాయింట్, ఎల్.ఇ.డి లైట్లు, సీ.సీ.టి.వీ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి మెరుగైన సౌకర్యాలను ఈ రైలు అందిస్తుంది. అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ అనేది నాన్-ఎసి స్లీపర్ కమ్ అన్‌రిజర్వ్‌డ్ క్లాస్ సర్వీస్. ఇది తక్కువ ఖర్చుతో మరియు ఎక్కువ దూరాలకు సేవలందించేలా రూపొందించ బడింది. మాల్దా టౌన్ - బెంగళూరు ఎక్స్ ప్రెస్ సరసమైన ఖర్చుతో మెరుగైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ ఎంపికలను అందించడం ద్వారా పర్యాటకాన్ని పెంచుతుంది.

## నమ్మించి మోసం చేసిన సమీర్ ను శిక్షించి, దళిత యువతికి న్యాయం చేయాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య



మంచిర్యాల టౌన్, డిసెంబర్ 29, ప్రజాపాలన : లినమ్మించి మోసం చేసిన సమీర్ ను శిక్షించి, దళిత యువతికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య అన్నారు. శుక్రవారం బాధిత యువతి హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలోని ఆమె ప్రియుడి ఇంటిముందు బయటయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధ్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి , దళిత యువతిని శరీరకంగా వాడుకొని మోసం చేసిన సమీర్ అనే వ్యక్తిని చట్టపరంగా శిక్షించి యువతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధిత యువతి మాట్లాడుతూ తనను మాయమాటలతో లోబరుచుకొని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఇప్పుడు కులం తక్కువ దానివి అంటూ సమీర్ తనని పెళ్లికి నిరకరిస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే పోలీసులు స్పందించి యువతికి రక్షణ కల్పించి, చట్టపరంగా సమీర్ ని శిక్షించాలని వారు అన్నారు. యువతికి మద్దతు గా స్థానిక మహిళలు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అభివృద్ధి కోసం 6 గ్యారంటీల పథకాలు

### జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు 6 గ్యారెంటీల పథకాలు అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని "రెబ్బెన మండలం కైర్ గాం గ్రామంలో" నిర్వహించిన ప్రజా పాలన" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు "ప్రజా పాలన 6 గ్యారంటీల ఫలాలను" అందించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుండి జనవరి 6, 2024 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలో అందించాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 365 గ్రామపంచాయతీలు, 1 పురపాలక సంఘం ఉన్నాయని, దరఖాస్తుల స్వీకరణ కొరకు 1 వేయి 335 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు ఫారముతో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ మానం కార్తీక్, ఉప సర్పంచ్, సెక్రెటరీ, కారోబాద్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## వెల్ నెస్ హాస్పిటల్ ను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వెల్ నెస్ అడ్వాన్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఆసుపత్రి యాజమాన్యం మంత్రి కి గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసుపత్రి వారు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ కార్డును ప్రజలు ఉపయోగించుకుని ఆర్థిక భారం పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్డు వల్ల ఆసుపత్రిలో పరీక్షలు యాభై శాతం వరకు తక్కువగా చెల్లించి సేవలు పొందవచ్చని వివరించారు. రాబోయే కాలంలో ప్రజలకు మంచి వైద్య సేవలు, చికిత్సలు అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఇలాంటి సేవలు అందించేందుకు ముందుకు వచ్చినందుకు ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల, విస్తృత స్థాయి సమావేశం



మంచిర్యాల టౌన్, డిసెంబర్ 29, ప్రజాపాలన : బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల, విస్తృత స్థాయి సమావేశాన్ని వేంపల్లి గ్రామంలోని ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మన పార్టీ ఓడిపోయిందని బాధపడకుండా ,ప్రతిపక్ష హెూదాలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, ప్రజల క్షేమమే ధ్యేయంగా పనిచేద్దామని,రాబోయే స్థానిక ఎన్నికలలో, పార్లమెంటు ఎన్నికలలో బి ఆర్ ఎస్ పార్టీ గెలిపే దిశగా పనిచేద్దామని,ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేసి మళ్లీ తెలంగాణ గడ్డ పైన గులాబీ జెండా ఎగర వేయాలని సూచించారు.ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా తమకు అండదండగా ఉంటానని ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యుడాని ,మీలో ఎవరికి ఏ కష్టం,ఆపద వచ్చినా క్షణంలో మీ ముందు ఉంటానని కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ యువ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ మున్సిపాలిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు , కౌన్సిలర్లు, సర్పంచులు ,ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ,ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, యువజన విభాగ నాయకులు విద్యార్థి ,విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్‌పై ఆందోళన వద్దు..

### జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. జి.సి. సుబ్బారాయుడు



మంచిర్యాల బ్యూరో, డిసెంబర్ 29 ప్రజాపాలన, : ప్రస్తుతం వ్యాపిస్తున్న కొవిడ్పై ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అవగాహన కలిగి ఉండి శుభ్రత పాటించాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాఎ. జి.సి. సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో డి.ఎస్.ఓ. డా. ఫయాజ్తో కలిసి కొవిడ్పై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ కొవిడ్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని, కొవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లాలోని 152 ప్రభుత్వ ఆసుపత్రులు, 17 (ప్రైవేట్ ఆసుపత్రులలో కొవిడ్ చికిత్స అందించడం జరుగుతుందని, 246 ఐ.సి.యు. పడకలు, 372 ఐసోలేషన్ పడకలు, 77 వెంటిలేటర్స్, 502 సాధారణ పడకలు అందుబాటులో ఉంచడంతో పాటు 175 మంది వైద్యులు, 426 మంది వైద్య సిబ్బంది, 491 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించడం జరిగిందని, 304 ఆక్సోమీటర్లు, 7 వేల 348 పి.పి.ఈ. కిట్లు, 20 వేల 715 మాస్కులతో వైద్య సేవలు అందించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న జె.ఎన్. -1 వేరియంట్ వైరస్ నియంత్రణపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉ న్నామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉన్నారని, ప్రతి రోజు 10 మందికి పరీక్షలు చేసే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కొత్త వేరియంట్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందని, 10 సం?ల లోపు పిల్లలు, 60 సం?ల వయస్సు దాటిన వృద్ధులు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, చేతులు శుభ్రపర్చుకోవాలని, అవసరమైతేనే బయటకు వెళ్ళాలని తెలిపారు. వేరియంట్లో జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శాసలో ఇబ్బందులు తలెత్తుతాయని, అనుమానం ఉన్నట్లయితే వెంటనే చేసుకొని అవసరమైన మందులు వాడాలని, ఆసుపత్రులలో అన్ని రకాల చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అన్ని ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కొవిడ్ వ్యాప్తి నియంత్రణ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిచందర్ రెడ్డి, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి సర్పంచ్: ఆవులు ఝాన్సీ



మధిర రూరల్ డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మండలంలోని దేశినేనిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరుగ్యారంటీలు అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఆవుల ఝాన్సీఈ సందర్భంగా తూమాటి నవీన్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా అర్హులందరూ సంక్షేమ పథకాలు అమలు కాక ఎదురుచూస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం శ్రీ ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క సారధ్యంలో ప్రతిష్టాత్మకంగా పథకాలు అమలు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన చేపట్టడం జరిగింది. కావున గ్రామస్థాయి నుండి పట్టణాల వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వంచే అందించబడినటువంటి దరఖాస్తును పూర్తిచేసి అధికారులకు సరైన టైంలో ఇచ్చి లబ్ధి పొందాలని ఇందులో ఏ ఒక్కరి మధ్యవర్తులు గాని దళారులకు గాని అవకాశం ఇవ్వకుండా నేరుగా అధికారులు ప్రజలకు పథకాలను అందిస్తారని కావున ఏ ఒక్కరూ అపోహన పడి నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో తూమాటి నవీన్ రెడ్డి దేశినేనిపాలెం గ్రామ సర్పంచ్ ఆవుల ఝాన్సీ, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఉప సర్పంచ్ పరిటాల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన అందరికీ 6 గ్యారంటీలు

## జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) సబావత్ మోతిలాల్



మంచిర్యాల బ్యూరో, డిసెంబర్ 29, ప్రజాపాలన: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన లబ్దిదారులందరికీ 6 గ్యారంటీల పథకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. శు క్రవారం జిల్లాలోని వేమనపల్లి మండలం మల్కలపేట, చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 6 గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు ఫారాలు అందించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి వార్డు / గ్రామ సభ వద్దకు రావాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జనవరి 6, 2024 వరకు (ప్రభుత్వ సెలవులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 8 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు, మధ్యాహ్నం 2 గం॥ల నుండి సాయంత్రం 6 గం?ల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 311 గ్రామపంచాయతీలు, 7 పురపాలక సంఘాలలో దరఖాస్తుల స్వీకరణ కొరకు 1 వేయి 702 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణ కొరకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణలో స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూ లైన్లు, మహిళల కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ కౌంటర్లు, త్రాగునీరు, టెంట్లు, కౌంటర్ల కొరకు టేబుళ్ళు, క్యూ లైన్ల కొరకు బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు ఫారముతో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని, స్వీకరించిన దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేసి ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 30, డిసెంబరు 2023

# 2024 : భారత పౌరుని ప్రార్థన

మనం వీడ్కోలు చెప్పనున్న ఈ సంక్షుభిత సంవత్సరం మరో రెండు రోజుల్లో అనంత కాలంలోకి నిష్క్రమించనున్నది. రాబోయే కొత్త రోజులు గడచిన వాటి కంటే మరీ అస్తవ్యస్తంగా ఉండవచ్చు. 2024లో బహు శ్రేష్ఠమైన భారత్, మరింత భద్రమైన విశ్వ ధాత్రి కోసం పరాత్పరుడిని ప్రార్థించాల్సిన సమయమాసన్నమయింది. మన దేశం పారతంత్ర్యంలో మగ్గుతున్న యుగంలో ఋషితుల్యుడైన మన జాతీయ మహాకవి రవీంద్రనాథ్ టాగోర్ తన మాతృభూమికి సుస్వతంత్రాన్ని కోరుతూ భగవంతుడిని ప్రార్థించాడు. 'ఎక్కడ మనసు నిర్భయంగా వుంటుందో, ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారోబీ ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో...' ఈ విన్నపం స్ఫూర్తితో, నూతన ఏడాదిలో జాతి జీవన ప్రస్థానం వెలుగు బాటలలో సాగేలా సహాయపడాలని కాలం మహాశక్తిని అభ్యర్థిస్తున్నాను.వచ్చే వేసవిలో భారతీయ ఓటర్లు తమ 18వ లోక్‌సభను ఎన్నుకోనున్నారు. ఆ సభలో ఆధిక్యం కోసం రాజకీయ పక్షాలు ఇప్పటికే తమ తమ ప్రయత్నాలు ప్రారంభించాయి. ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయనున్న ఆ ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలి. స్వార్థ జోక్యాలకు తావుండకూడదు. ఆ బృహత్తర ప్రజాస్వామ్య ప్రక్రియను నిర్వహించే ఎన్నికల సంఘం, టి.ఎన్.శేషన్ లాంటి కఠిన కర్తవ్య పరాయణుడి స్ఫూర్తిదాయక వారసత్వాన్ని పునరుద్ధరించేందుకు దీక్షా దక్షతలతో పూనుకోవాలి. ఒక నిష్పాక్షిక సంస్థగా ఎన్నికల సంఘం తన అధికారాల ప్రాతిపదికలను పునరన్వేషించాలి. తన పేరు ప్రతిష్ఠలను కాపాడుకొని గౌరవాన్ని పెంపొందించుకోవాలి. ఎన్నికలలో ఓటమి సంభవిస్తే అందుకు ఈవీఎమ్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లలో అక్రమాలు జరిగాయని నిందించకూడదు. గెలిచిన పక్షంలో అవి సక్రమంగా పని చేశాయని కితాబునివ్వకూడదు. అలా వ్యవహరించడం మన పరిణతి రాహిత్యాన్ని మాత్రమే సూచిస్తుంది.ఎన్నికల ప్రచారంలో రాజకీయ పక్షాలు కుల మతాల సంకుచితత్వ భావోద్వేగాలను రెచ్చగొట్టకూడదు. సంయమనం పాటించాలి. ఓటర్ల మద్దతును సాధించుకోవడంలో నిజాయితీగా పోటీ పడాలి. ఓటర్ల మధ్య శత్రుత్వం నెలకొనేలా ఆవేశపూరిత ప్రసంగాలు చేయకూడదు వివిధ సామాజిక సముదాయాల మధ్య తీవ్ర విభేదాలను సృష్టించే ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాలి. అభ్యర్థులను వ్యక్తిత్వ ఉన్నతి, నాయకత్వ యోగ్యత ఆధారంగా మాత్రమే ఎంపిక చేయాలి. వంశపారంపర్యతను ఎట్టి పరిస్థితులలోనూ ఒక యోగ్యతగా చూడకూడదు. గొప్ప కుటుంబాల నుంచి రావడం కంటే వ్యక్తి గుణ సంపద మాత్రమే అభ్యర్థి ఎంపికకు అన్ని విధాల మంచి అర్హతగా పరిగణించాలి. ఎన్నికల బాండ్లు, ధన బలం ఎన్నికల తీరుతెన్నులను అధికార పక్షానికి అనుకూలంగా ప్రభావితం చేసే పరిస్థితులు ఎంత మాత్రం ఉండకూడదు. రాజ్యాంగ సంస్థలు నిష్పాక్షికంగా వ్యవహరించాలి. గెలిచిన అభ్యర్థి మొట్టమొదట తనకు ఓటువేయని వారి హృదయాలను గెలుచుకోవడానికి ప్రయత్నించి తీరాలి. తన సేవలను కేవలం తనకు ఓటు వేసిన వారికి మాత్రమే పరిమితం చేయకూడదు.అధికార పక్షం తన ప్రత్యర్థులను అణచివేసేందుకు నేర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచకూడదు. చట్టాలకు మాత్రమే అవి నిబద్ధమవ్వాలి. ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎంత చురుగ్గా వ్యవహరించడం జరుగుతుందో అంతే శక్తిమంతంగా భారతీయ జనతా పార్టీ పాలిత రాష్ట్రాలలో కూడా ఆ దర్యాప్తు సంస్థ చర్యలు చేపట్టాలి. ఒక రాజకీయవేత్త ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బనాయించిన కేసులను, అతడు అధికార పక్షానికి ఫిరాయించినప్పుడు మాఫీ చేయకూడదు. నిర్దిష్ట రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చే చట్టవిరుద్ధ అరెస్టులు చేసేందుకు పోలీస్ విభాగాలు తిరస్కరించాలి. పౌరస్వేచ్ఛలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు సుప్రీంకోర్టు చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాలి. జైలుకు పంపడం కాకుండా బెయిల్ ఇవ్వడమే న్యాయవ్యవస్థకు మార్గదర్శక సూత్రంగా ఉండాలి. విచారణలో ఉన్న ఖైదీలు సంవత్సరాల తరబడి కారాగారాలలో కృశించిపోయే పరిస్థితులను అరికట్టాలి. రాజకీయ ప్రాధాన్యమున్న కేసులలో న్యాయ నిర్ణయాలు ఎటువంటి పక్షపాతం చూపకుండా ఉండాలిబీ అధికార పెద్దల ఒత్తిళ్లకు లొంగి తీర్పులు వెలువరించకూడదు. సహజ న్యాయసూత్రాలను కేవలం ప్రాబల్యం, పలుకుబడి గల వ్యక్తుల విషయంలో మాత్రమే కాకుండా ప్రతీ పౌరుడికీ సమంగా వర్తింపచేయాలి. అభిరాముడు అందరివాడు. అయోధ్యలో రామాలయం జాతి సమైక్యతను సుదృఢం చేయాలి. భిన్న సామాజిక వర్గాల మధ్య స్నేహ వారధులు నిర్మించడానికి మారుగా విభేదాలు సృష్టించేలా రాజకీయ, మతపరమైన ఆధిక్యతకు ఆ కోవెల ఒక ప్రతీకగా పరిణమించకూడదు. మణిపూర్‌లో జాతుల ఘర్షణను నివారించాలి. ఆ దురదృష్టకర పరిణామం మణిపూర్ రాష్ట్ర విభజనకు, ప్రజల మధ్య ఎడతెగని చీలికలకు కారణమయ్యేందుకు ఎటువంటి పరిస్థితులలోను అనుమతించకూడదు. మెయితీలు, కుకీలు సహానుభూతి, సుహృద్భావంతో కలసిమెలసి జీవించేందుకు తోడ్పడాలి. మణిపురి అస్తిత్వ స్ఫూర్తిని వారిలో మళ్లీ నిండుగా ప్రజ్వలింప చేయాలి. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని సత్వరమే పునరుద్ధరించాలి. ఆ వెన్వెంటనే ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు నిర్వహించాలి. కశ్మీర్ ముస్లింలు, కశ్మీర్ పండిట్‌లలో పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ఒక 'సత్య నిర్ధారణ, సమన్వయీకరణ సంఘం'ను నియమించాలి. పాత గాయాల నుంచి ఉపశమనం కలిగించి ఉభయ వర్గాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పాలి. పార్లమెంటు భారత ప్రజాస్వామ్య దేవాలయం పవిత్రతను ప్రదీప్తపరచాలి. ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య పరస్పర విశ్వాసం సడలిపోకూడదు. సమన్వయంతో శాసన నిర్మాణ బాధ్యతలను నిర్వర్తించాలి. ప్రజల సమస్యలకు ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయాలి. ప్రతిపక్షం మరింత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. సభ్యులను ఒకేసారి పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేసే ధోరణులకు స్వస్తి చెప్పాలి. సభ్యులు ప్లకార్డులతో పోడియమ్ వద్దకు దూసుకుపోయి గలాభాను సృష్టించడాన్ని నిరుత్సాహపరచాలి. కీలక బిల్లులను సమగ్ర చర్చల అనంతరమే ఆమోదించాలి. పాలక, ప్రతిపక్షాల మధ్య చర్చలు కొరవడేందుకు అధికార పక్షం సంఖ్యా బలం కారణం కాకూడదు. కుల ప్రాతిపదిక రిజర్వేషన్లను సమాజంలో విభేదాలు, వైషమ్యాలు మరింతగా పెరిగిపోయే విధంగా విస్తరింపచేయకూడదు. నియామక ఉద్యోగ పరీక్షల ప్రశ్నపత్రాలను అక్రమంగా బహిర్గతం చేసి లక్షలాది యువతీయువకుల ఉద్యోగ స్వప్నాలు, ఆకాంక్షలను భగ్నం చేయకూడదు.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# ఇన్నేళ్ళ నిర్బంధం ఇక తొలుగుతుందా?



కొన్నిసార్లు మనం కోల్పోయిందేమిటో మనకు తెలియదు. ఎందుకు కోల్పోయామో తెలియదు. అలాంటప్పుడు ఏం సాధించాలో తేల్చుకోవడం కష్టం. పదేళ్ల కేసీఆర్ పాలన తర్వాత తెలంగాణ ఈ విషయాల్లో లోతైన ఆత్మావలోకనం చేసుకోక తప్పదు. ఆంధ్రా వలస పాలనలో తెలంగాణ ఆత్మగౌరవంతో సహా ఒక ప్రాంతంగా సమాన అవకాశాలన్నిటినీ కోల్పోయింది. అయినా సామాజిక, రాజకీయ చైతన్యాన్ని, ప్రతిఘటనా స్ఫూర్తిని పదిలంగా కాపాడుకుంది. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సాధించుకున్న వాటికంటే కోల్పోయినవే ఎక్కువ. తెలంగాణకు చాలా సహజమైన ప్రజాస్వామిక భావజాల సంఘర్షణ ఈ పదేళ్లలో ఎట్లా దెబ్బతినిపోయిందో ఈ ప్రాంతం పరిశీలించుకోవలసి ఉన్నది.తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి తానే నాయకత్వం వహించానని బీఆర్ఎస్ చెప్పుకొనేది. అలాంటి పార్టీ పాలనలో ప్రజాస్వామ్యం అడుగంటిపోయింది. ఇది పెద్ద విషాదం! ఈ స్థితిలో కూడా తెలంగాణ ప్రజలు ఎంతో కొంత నిరసనను వ్యక్తం చేస్తూనే వచ్చారు. అయితే అందులో మునుపటి ఉత్తేజం లేదు, ధిక్కారం లేదు. కేసీఆర్ ఆర్థిక విధానాలతో సహా నిర్బంధం కూడా గతంలాగే వెంటాడింది. వీటిని వేరు చేసి ప్రజాస్వామ్యాన్ని చూడలేం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో మారు మూల పల్లె దాకా తెలంగాణ ఎంత ఉద్రిక్తంగా ఊగిపోయింది? రాష్ట్రం ఎందుకు అవసరమో ఎన్ని రకాల కొత్త వాదనలు కింది నుంచి పుట్టుకొచ్చాయి? ప్రజలు ఎంత సృజనాత్మకంగా వ్యక్తమయ్యారు? సమాజం సజీవంగా ఉందనడానికి ఇదంతా గుర్తు. అదే సమయంలో ఉద్యమంలోని ఆటుపోట్లను అర్థం చేసుకోలేకనే కావచ్చు యువత అత్మహత్యలకు పాల్పడింది. అర్థాంతర మరణాలు, హత్యలు, ఆత్మహత్యలు లేని తెలంగాణ కోరుకున్న జనం దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆ విషాద స్థితిలోనే రాష్ట్రం వచ్చింది. దీన్నుంచి బైటపడక ముందే 2015 ఏప్రిల్ 7న వరంగల్ జైలు నుంచి తీసికెళ్తూ ఐదుగురు ముస్లిం యువకులను పోలీసులు కాల్చేశారు. దీని మీద ఎంఐఎం కూడా ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత 2015 జూన్ 15న వివేక్ అనే తెలంగాణ విద్యార్థిని పోలీసులు కాల్చి చంపారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో వరంగల్ జిల్లా తాడ్వాయి అడవుల్లో విద్యాసాగర్, శృతి ఎన్‌కౌంటర్ జరిగింది. 2016 మార్చిలో చత్తీస్‌ఘడ్‌లోని బెట్టెంతోగు అనే ప్రాంతంలో ఆరుగురు పక్క రాష్ట్రం వాళ్లతోపాటు తెలంగాణకు చెందిన యూసుబ్‌బీ, సృజన, దలసరి సారక్క (తెలంగాణ ఆదివాసీ) అనే ముగ్గురు యువతుల హత్యలను మర్చిపోవడానికి లేదు. ఇక ఆ తర్వాత ఈ జాబితా చాలా పెరిగిపోయింది. వివేక్ హత్యకు తెలంగాణ ప్రభుత్వానికి సంబంధం లేదని అప్పట్లో పాలక ఆశ్రిత మేధావులు అన్నారు. కానీ అప్పటికే కేసీఆర్ ప్రభుత్వం విప్లవోద్యమం మీదికి పోలీసు బలగాలను మోహరించింది. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో, గోదావరి తీరమంతా పోలీసు క్యాంపులు పెట్టింది. వెంటాడి హత్యలు చేయడానికి పురికొల్పింది. పైన చెప్పిన ఘటనలే కాదు, 2016 జూన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు ఆదివాసీ, దళిత యువకులు శోభన్ తదితరులను ఎన్‌కౌంటర్ పేర కాల్చేశారు. ఆ సమయంలో తెలంగాణ పోలీసు ఉన్నతాధికారి ఆ ప్రాంతంలోనే ఉన్నాడని పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ అణచివేత మావోయిస్టుల దగ్గరే ఆగలేదు. 2019 జులై 19న సీపీఐ న్యూ డెమోక్రసీకి చెందిన లింగన్న అనే ఆదివాసీ నాయకుడ్ని కాల్చేశారు. జనశక్తి పార్టీకి చెందిన 9 మందిని టేకులగూడెం ప్రాంతంలో కాల్చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసులే ఈ ఘటనలకు పాల్పడ్డారు. పక్క రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగిన సందర్భాల్లో అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులను వేధించారు. సంస్మరణ సభలు కాదు కదా, పదో రోజు పది మంది కలిసి కన్నీరు కార్చకుండా అడ్డుకున్నారు. కరోనాతో అడవిలోనే చనిపోయిన మావోయిస్టు నాయకుడు హరిభూషణ్ కుటుంబ సభ్యులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పదో రోజు జరుపుకోవాలని ఏర్పాటు చేసుకుంటే తెలంగాణ పోలీసులు దాన్ని జరగనివ్వలేదు. ఆ రోజు పోలీసులు ఎంత దుర్మార్గానికి పాల్పడిందీ ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి సీతక్కకు అందరికన్నా బాగా తెలుసు. కరోనా కాలంలో కూడా ఆరుగురు తెలంగాణ కార్యకర్తలను టీఆంఎస్ ప్రభుత్వం కాల్చేసింది. మావోయిస్టుల మీది నిర్బంధమే తెలంగాణలో ప్రజాస్వామ్య పతనానికి ఏకైక సూచిక కాకపోవచ్చు. ప్రజాస్వామ్యం అనే అత్యద్భుత భావనను గత పదేళ్లలో అనేక వైపుల నుంచి దెబ్బతీస్తూ వచ్చారు. రైతులకు సంకెళ్లు వేసి వేధించారు. ఆర్టీసీ కార్మికుల మీద ప్రభుత్వం ఒక యుద్ధమే చేసింది. లెక్కకు మిక్కిలి జరిగిన పౌర హక్కుల ఉల్లంఘనలకు గరిష్టంగా విప్లవ రాజకీయాలనే సాకు చేసుకున్నారు. మావోయిస్టు పార్టీ మీద నిషేధం ప్రజాస్వామ్య విధ్వంసానికి కేంద్రంగా పని చేసింది. అందువల్ల ప్రజలు తమకు ఇష్టమైన రాజకీయాలను ప్రకటించుకొనే వీలు లేకుండా చేశారు. ఇష్టమైన సంఘాల్లో, పార్టీల్లో ఉండటం నేరమని వెంటాడి హత్యలు చేశారు. అరెస్టులు చేసి జైళ్లలో తోశారు. మావోయిస్టు పార్టీ పదేళ్ల వార్షికోత్సవ సభను జరగనివ్వకుండా ముందు రోజే వందలాది మందిని అరెస్టు చేశారు. సాగర్, శృతి ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా 200 సంస్థలతో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంపై ఉక్కుపాదం మోపారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యాలయానికి పోలీసులు తాళం వేసుకొని వెళ్లిపోయారు. చివరికి కోదండరాం ఒక సభను తలపెడితే దాన్ని జరగనివ్వకుండా ఆయన ఇంటి మీద దాడి చేసి తలుపులు బద్దలు కొట్టారు, అరెస్టు చేశారు. గత ప్రభుత్వాలకంటే నాలుగు ఆకులు ఎక్కువ చట్ట వ్యతిరేకంగా ఈ పదేళ్ల పాలన సాగింది. ప్రజలకు రాజకీయ జీవితం లేకుండా చేయాలని అనుకోవడంలోనే ప్రజాస్వామ్య పతనం ఉంది. మావోయిస్టు రాజకీయాలకు అవకాశం లేకుండా చేయడంతో కేసీఆర్ ఈ పని మొదలుపెట్టాడు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్‌గా మారిపోయింది. ఆ తర్వాత అదే చట్టం కింద పదహారు ప్రజాసంఘాలను టీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధించింది. దానికి కూడా మావోయిస్టులతో సంబంధం అనే ఆరోపణ తప్ప ఆధారాలేవీ లేవు. అనేక రాజకీయ విశ్వాసాల, ఆచరణ రూపాల కూడలిగా వర్ధిల్లిన తెలంగాణను కేసీఆర్ ఏం చేశాడో, తెలంగాణ ఏం కోల్పోయిందో గుర్తిస్తే తప్ప ప్రజాస్వామ్య పునరుద్ధరణ సాధ్యం కాదు. కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధర్నా చౌక్ గురించి మాట్లాడుతున్నారు. అక్కడ మావోయిస్టు రాజకీయ వ్యక్తీకరణకు చోటు ఉంటుందా? రాడికల్ విద్యార్థి సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య వంటి సంఘాలకు అవకాశం ఉంటుందా? ప్రతిపక్ష పార్టీ నుంచి ఇలాంటి సంస్థలన్నిటికీ చోటు ఉంటేనే కదా భావవ్యక్తీకరణ నిండైన అర్థాన్ని సంతరించుకొనేది. భావ ప్రకటన సాహిత్య కళా మేధో రంగాలకు సంబంధించిందే కాదు. మౌలికంగా అది రాజకీయ ఆచరణ. ఏ రాజకీయ ఆచరణకైనా చోటు ఉండాలి. మావోయిస్టుల దగ్గర తుపాకులు ఉన్నాయనే సాకుతో రేషన్ పద్ధతిలోకి ప్రజాస్వామ్యాన్ని కుదించడానికి లేదు. హింసను నిరోధించడానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తయారు చేసుకున్నాయి. అయినా రాజకీయాల మీద, సంస్థల మీద నిషేధం పెట్టి పోలీసులు హింసకు పాల్పడటం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. తన పాలనలో రాజకీయాల మీద నిషేధం ఉండటం ఏమిటని ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ఆలోచించాలి. ఒక అక్రమ చట్టం ద్వారా నిషేధాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తానని అనడం ఎంత అసంబద్ధమో ఆయన గ్రహించాలి. బీజేపీతో కేసీఆర్ సఖ్యంగా మసలుకోవడంతో పెరిగిపోతున్న మతతత్వ శక్తుల మధ్య కొద్ది మెజారిటీ మాత్రమే ఉన్న తన ప్రభుత్వం కొనసాగాలన్నా సమాజం రాజకీయ చైతన్యంతో సజీవంగా ఉండాలి. అనేక భావాల వ్యక్తీకరణకు చోటు ఉండాలి. కాబట్టి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ శక్తులను నిలువరించడానికి ఇప్పటి నుంచే జరగవలసిన ప్రజాస్వామిక ఆందోళనలో మావోయిస్టుపార్టీ మీద, దాని అనుబంధ సంఘాల మీద నిషేధం ఎత్తివేత ఒక ముఖ్యమైన అంశం కావాలి. మిగతా అన్ని రకాల ఆంక్షలు, నిర్బంధాలు, అప్రజాస్వామిక చట్టాలు తొలగిపోవాలని కోరుకోవాలి.

# పోలీస్, న్యాయ వ్యవస్థల్లో ఏళ్ళనాటి అపసవ్యతలు!

స్థలం విషయమై వచ్చిన ఒక సమస్యలో నేను కోర్టులో వేయాల్సిన కేసు ఒక్కటే అయినా, ప్రభుత్వ అవినీతిని నిరూపిస్తూ అధిగమించాల్సిన సమస్యలు అనేకం ఎదురయ్యాయి. అందులో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తాను. 1) ప్రజా ప్రయోజన భూప్రాంతాలలో పంచాయతీ సిబ్బంది అనధికార రియలెస్టేట్ వ్యాపారం. 2) ప్రభుత్వ ఉద్యోగుల ప్రజా ప్రతినిధుల దురాక్రమణలు. 3) ప్రజా ప్రయోజన భూప్రాంతాల ఆక్రమణదారుల నుంచి పంచాయతీల అనధికార పన్ను వసూళ్లు. 4) రెవెన్యూ శాఖ రికార్డులలో చేసిన ఉద్దేశ్యపూర్వక తప్పులు. 5) ప్రభుత్వ ఉద్యోగులు,అధికారులు దురాక్రమణదారులకు అందించిన నకిలీ పత్రాలు. 6) నకిలీ పన్ను రసీదులతో కోర్టులో దురాక్రమణదారులచే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసులు. 7) ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కోర్టులకు లిఖిత పూర్వకంగా అందించే అబద్ధపు సమాచారం... వీటన్నిటికీ ఇప్పుడు చేరిన మరొక సమస్య: 8) పోలీసులు నమోదు చేసే అబద్ధపు నేరాలు.భారత చట్ట వ్యవస్థకు ప్రధాన ప్రాథమిక సూత్రాలుగా సుప్రీంకోర్టు కూడా చెప్పినవి: 'నేరం ఋజువు కానంత వరకు అందరూ నిర్దోషులే', 'ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు'. కానీ ఈ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకమైన పద్ధతులు పోలీస్ వ్యవస్థలో నెలకొన్నాయి. పోలీసులు తమ 'విచక్షణాధికారం'తో ఫిర్యాదు నమోదు చేయాలా వద్దా? అని నిర్ణయిస్తున్నారు. ఫిర్యాదు స్థాయిలోనే తమ విధుల పరిధిని అతిక్రమించి 'విచక్షణా ధికారం'తో చట్ట సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేస్తూ, తద్వారా ఫిర్యాదు స్థాయిలోనే కేసుకు నేర దృక్కోణం ఆపాదిస్తున్నారు. చట్ట ప్రక్రియ జరగకుండానే ఫిర్యాదు స్థాయిలో తయారుచేసిన ఈ నేర దృక్కోణాలతో పౌరహక్కులకు భంగం కలిగించడానికే ఈ 'విచక్షణాధికారం'ని దుర్వినియోగం చేస్తున్నారు. ఋజువులు (సాక్ష్యం వేరు) లేకపోయినా 'విచక్షణాధికారం'తో 'నాన్ బెయిలబుల్' సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో




నమోదు చేస్తున్నారు. అలా నాన్ బెయిలబుల్ సెక్షన్లతో అనుమానితుడిని అరెస్ట్ చేయగల వెసులుబాటును కలిగించుకుంటున్నారు. ఇలా విచాక్షణాధికారాలతో చట్ట సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడం పోలీస్ వ్యవస్థలలో ఆచరిస్తున్న అతిపెద్ద అపసవ్య పద్ధతి. ఇలాంటి అవకతవకలతో, నేడు పోలీసులు నేర నిరూపణకు ప్రయత్నించడంపోయి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.పోలీస్, న్యాయ వ్యవస్థలలో జరగాల్సిన పద్ధతులను ఒక వరసలో అమరిస్తే 1) ఫిర్యాదు నమోదు పరిశోధన, 2) ప్రాథమిక దర్యాప్తు (ఎఫ్ఐఆర్), 3) నేర పరిశోధన, 4) కోర్టు ప్రొసీడింగ్స్, 5) నేర నిర్ధారణ, 6) నిజనిజాల నిర్ధారణ, 7) వాది ప్రతివాదుల సమక్షంలో 'ఏయే చట్ట సెక్షన్‌లు వీటికి అమలవుతాయి?' అన్నది కోర్టు నిర్వచించడం, 8) తీర్పునివ్వడం... ఈ వరస క్రమం తూచా తప్పక ఆచరిస్తే అవినీతికి ఆస్కారం తక్కువగా ఉంటుంది, పౌర హక్కులకు భంగం వాటిల్లదు. ఈ వరస క్రమాన్ని పరిశీలిస్తే ఇందులో పోలీసుల బాధ్యత 'నిజ నిర్ధారణ, నేర నిర్ధారణ, నేర నిరూపణ' వరకే పరిమితం. చట్ట సెక్షన్ల నిర్ధారణ కోర్టులో జరుగుతుంది. కానీ పోలీసులు ఈ వరస క్రమాన్ని తారుమారు చేసి, మొదటి లేదా రెండో దశలోనే 'బెయిలు/ నాన్ బెయిలు' అనే సెక్షన్ల నమోదు తో తమ అధికార జులుంకు వెసులుబాటు కల్పించుకుంటున్నారు.వ్యక్తి హక్కులను నిలబెట్టేందుకు విచక్షణాధికారాలకు తావులేకుండా, విధివిధానాల వరస క్రమ కూర్పును నిర్ధారించడం, 'ప్రశ్న సమాధానాల' పట్టికలను తయారు చేయటం, సమాధానాలకు విలువ ఇచ్చి దాన్ని బట్టి పోలీస్ చర్య ఏమిటి అన్నది నిర్ణయించడం వంటి శాస్త్రీయ విధానంతో వ్యవస్థ నడిచే ఏర్పాట్లు ఇంకా ఏర్పడక పోవటం ఐఏఎస్, ఐపీఎస్‌ల అసమర్థతనే సూచిస్తున్నది. కోర్టుల కంప్యూటరైజేషన్ వ్యవస్థలలో కూడా ప్రజల హక్కులను బలపరిచేందుకు అవసరమైన సాంకేతిక ఆటోమేషన్‌లో ఆవిష్కరణలు జరగలేదు. ప్రభుత్వంలో ప్రతి శాఖలోనూ కొత్తగా నిర్మిస్తున్న కంప్యూటర్ వ్యవస్థలలోనూ అవినీతికి అనుకూలమైన లోపాలను చొప్పిస్తున్నారు.స్వాతంత్ర్య పోరాట కాలంలో బారిస్టర్లుగా కేసుల మీద లక్షలు సంపాదించేవారని మనం చదువుకున్నాం. అంటే, బ్రిటిష్?వారు ఏర్పాటుచేసిన కార్యనిర్వాహక, పోలీస్, న్యాయ వ్యవస్థల అమలు మొదటి నుంచి ఈ రోజు వరకు కూడా అదే అధికార దుర్వినియోగానికి వెసులు బాటు కలిగిస్తూ, వివాదాలకు చోటు కల్పిస్తున్నవి. స్వాతంత్ర్యం తర్వాత కూడా అలాగే ఉండి నేటికీ చట్టం శిక్ష ముసుగు లో వాటిపైన అధికాదాయం కల్గించే ఆదాయ మార్గాలు నిర్మించబడ్డాయి. ఈ పరిస్థితి లేకుండా ప్రభుత్వం అతి సూక్ష్మస్థాయి వరకు పారదర్శకతతో ఇంజినీర్డ్ వ్యవస్థలు నిర్మించాలి. ప్రభుత్వంలోను, పోలీసు వ్యవస్థలోను, కోర్టు వ్యవస్థలోనూ విధాన ప్రక్రియలను ఎవరు ఏర్పాటు చేస్తున్నారు? అందులో ప్రజల పాత్ర ఎంత? తప్పులు ఎవరు సవరిస్తున్నారు? వాటి సహేతుకతను, ప్రజల మీద వాటి ప్రభావాన్ని ఎవరు అంచనావేస్తున్నారు? వాటి అమలును ఎవరు ఏ ప్రాతిపదిక మీద ఆమోదిస్తున్నారు?... ఈ విషయాలపై ఆడిట్ చేస్తూ ఎల్లప్పుడూ సరిగా నడిచేలా చూసే, ఈ అవినీతిని అడ్డుకునే వ్యవస్థ నేడు లేదు.

# ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు





**వర్ధన్నపేట(వరంగల్) :** వరంగల్ జిల్లావర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం రెడ్డిపాలెం క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళుతున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది ఈ ఘటనలో 13 మంది కూలీలు గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం కూలి పని కోసం అంబేద్కర్ నగర్ వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 13 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. చికిత్స కోసం స్థానికులు వారిని హాస్పిటల్‌కు తలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కర్నాటకలో భాష వివాదం

కర్నాటకలో వెలుగు చూసిన భాషా వివాదం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కర్నాటకలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి అన్ని వాణిజ్య సంస్థలు, దుకాణాల నామఫలకాల్లో 60శాతం కన్నడ అక్షరాలే ఉండాలని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీ చేశారు. 60 శాతం కన్నడ అక్షరాలు, 40 శాతం ఇతర భాషాల అక్షరాలతో నామఫలకాలు ఉండేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డినెన్స్ సంబంధించిన నియమాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 28లోగా అన్ని కంపెనీలు, సంస్థలు, ఇతర దుకాణాలు తమ నేమ్‌ప్లేట్‌లను మార్చుకోవాలని సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. కన్నడ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాపారులంతా వీటిని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. '60 శాతం కన్నడ' పేరుతో ఓ ఉద్యమం తెర మీదికి వచ్చింది. కర్నాటకలో వ్యాపారాలు నిర్వహించేవారు.. దుకాణాల ముందు ఇంగ్లీష్‌లో సైన్ బోర్డుల ఏర్పాటు చేయడంతో కన్నడ భాష అంతరించే ప్రమాదం ఉందంటూ కర్నాటక రక్షణ వేదిక ఆందోళనలకు దిగింది. వాణిజ్య వ్యాపార సంస్థల సైన్ బోర్డులపై '60శాతం కన్నడ' అక్షరాలే ఉండాలన్న నిబంధనను అమలు చేయాలని పట్టుబడుతోంది. కర్ణాటకలో భాషా వివాదం మరింత ముదిరింది. దుకాణాదారులు, ఇతర వ్యాపార సంస్థల సైన్ బోర్డులలో 60 శాతం వరకూ కన్నడ భాషనే వినియోగించాలన్న ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తోంది. కర్నాటక రక్షణ వేదిక సభ్యుల దాడులు పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు దారితీశాయి. అటు.. ఆందోళనకారుల తీరుపై ప్రభుత్వం సీరియస్ అయింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకునేదిలేదంటూ వార్నింగ్ ఇచ్చింది. కర్ణాటకలో వెలుగు చూసిన భాషా వివాదం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. '60 శాతం కన్నడ' పేరుతో ఓ ఉద్యమం తెరమీదికి వచ్చింది. కర్నాటకలో వ్యాపారాలు నిర్వహించే వారు.. దుకాణాల ముందు ఇంగ్లీష్‌లో సైన్ బోర్డుల ఏర్పాటు చేయడంతో కన్నడ భాష అంతరించే ప్రమాదం ఉందంటూ కర్నాటక రక్షణ వేదిక ఆందోళనలకు దిగింది. వాణిజ్య వ్యాపార సంస్థల సైన్ బోర్డులపై '60శాతం కన్నడ' అక్షరాలే ఉండాలన్న నిబంధనను అమలు చేయాలని పట్టుబడుతోంది. ఈ క్రమంలోనే.. నేమ్ బోర్డుల విషయంలో టీఏ నారాయణగౌడ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అయితే.. బెంగళూరులోకర్నాటక రక్షణ వేదిక నిర్వహించిన ర్యాలీలు ఉద్రిక్తతకు దారితీశాయి. కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌తోపాటు వలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన ఆందోళనకారులు.. హోటళ్లు, దుకాణాలపై ఆంగ్లంలో ఉన్న సైన్‌బోర్డులను తొలగించి విధ్వంసం సృష్టించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలు కన్నడవాదం అనే తేనెతుట్టను మరోసారి కదిపాయి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ కన్నడ భాషను నేర్చుకోవాలని, అందరూ కన్నడిగులే అవ్వాలని తేల్చి చెప్పారు సిద్దరామయ్య. అంతకు ముందే కీలక ఉత్తర్వులు జారీ చేశారు. బెంగళూరు సిటీలో బిజినెస్ చేస్తున్న వాళ్లంతా నేమ్ బోర్డులపై కచ్చితంగా కన్నడ భాషలో రాయాలని, అందుకు కొంత ఖాళీ ఉంచాలని తేల్చి చెప్పింది ప్రభుత్వం. బెంగళూరు మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆర్డర్ పాస్ చేసింది. బిజినెస్‌లకు సంబంధించిన నేమ్ బోర్డులలో 60% మేర కన్నడనే కనిపించాలనేది ఈ ఉత్తర్వులలో సారాంశం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా సిటీ అంతటా ఇది అమలవ్వాలని రూల్ పెట్టారు. కన్నడవాదులంతా ఈ నిబంధన పెట్టినందుకు ప్రభుత్వాన్ని పొగిడారు. కానీ...రూల్ పెట్టినంత వరకూ బాగానే ఉంది. అమలు చేయడంలోనే చాలా ఆలస్యం జరుగుతోంది. ఇప్పటికీ చాలా బోర్డులపై ఇంగ్లీష్ కనిపిస్తోంది. ఇది చూసి అసహనానికి గురైన కన్నడ సంఘాలు క్రమంగా ఆందోళనలు ఉద్ధృతం చేశాయి. "ఇచ్చిన ఉత్తర్వుల మాటేంటి" అంటూ నిలదీస్తున్నాయి. ప్రత్యేకంగా ఓ ప్రచారాన్నే మొదలు పెట్టింది. భారీ వాహనాల్లో బెంగళూరు రోడ్లపై తిరుగుతూ కన్నడకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. కన్నడ నేలపై ఉంటూ..ఇక్కడే ఉపాధి పొందుతున్నప్పుడు కన్నడ భాషను గౌరవించడానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నిస్తున్నారు. నేమ్ బోర్డులను కన్నడ భాషలోనే పెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారమే కాస్త అదుపు తప్పి ఆందోళనలకు కారణమైంది. కన్నడలో సైన్‌బోర్డులకు సంబంధించి బెంగళూరు నగర పాలక సంస్థ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక.. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఆయా ఘటనల్లో పాల్గొన్నవారిని అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక రక్షణ వేదిక నేతలను అరెస్ట్ కోర్టులో హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. కర్నాటక రక్షణ వేదిక ఆందోళనల నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించారు. తాజా పరిస్థితులపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన ఆయన.. కర్నాటకలో సైన్ బోర్డులు, నేమ్‌ప్లేట్లలో 60 శాతం కన్నడలో ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఫిబ్రవరిలోగా మార్పులు చేయాలని షాపుల యజమానులను ఆదేశించామని చెప్పారు. ఉత్తర్వులు అమలయ్యేందుకు ఒక ఆర్డినెన్స్‌ను కూడా తీసుకొస్తామని తెలిపారు. అయితే.. రెచ్చిపోయి వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు సీఎం సిద్దరామయ్య. ఇక.. కన్నడ పరిరక్షణ పేరిట ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని ఉపేక్షించబోమన్నారు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. రాష్ట్ర భాషను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కన్నడ కోసం పోరాడుతోన్న వారికి తాము వ్యతిరేకం కాదు.. వారిని గౌరవిస్తాం.. కానీ.. విధ్వంసానికి పాల్పడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అంతేకాదు ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసన వ్యక్తం చేయొచ్చు.. నల్ల జెండాలతో ఆందోళన చేయొచ్చు.. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని కోరవచ్చు.. కానీ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# న్యాయ వ్యవస్థలో ఎస్సీ ఎస్టీ బీసీలకు న్యాయం జరిగేలా చూడండి

ప్రభుత్వానికి ఫోరం ఫర్ ఎస్సీ ఎస్టీ బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ విజ్ఞప్తి.




హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి):న్యాయాన్ని ధర్మాన్ని కాపాడాల్సిన న్యాయ వ్యవస్థలో 93 శాతానికి పైగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయా వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని దేశ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఫోరం ఫర్ ఎస్సీ ఎస్టీ బీసీ అడ్వకేట్ ఆఫ్ తెలంగాణ విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ న్యాయమూర్తి, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మ నారాయణ, ఫోరం ప్రతినిధులు గాలి వినోద్, భీమరావు లు మాట్లాడారు. 75 సంవత్సరాల లో నేటి వరకు ఒక్కరు కూడా అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పదవులు ఎస్సీ ఎస్టీలకు దక్కలేదని అన్నారు. గత ప్రభుత్వం నామమాత్రంగా బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని అడ్వకేట్ జనరల్ గా నియమించిందని అన్నారు. ఇటు న్యాయమూర్తుల నియామకాలలో అటు న్యాయవిభాగ నియామకాలలో ఎస్సీ ఎస్టీ బీసీలు వివక్షకు గురవుతున్నారని అన్నారు.ప్రభుత్వ ప్లీడర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాలలో ఎస్ సి, ఎస్ టి, బీసీ లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నేటి వరకు ఏ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యమంత్రి ఉంటే ఆ వర్గానికి చెందిన వ్యక్తులకే న్యాయ వ్యవస్థలో అవకాశాలు ఇస్తుండడం వివక్ష ఏ స్థాయిలో జరుగుతుందో స్పష్టమవుతుందని అన్నారు. ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు పంపిన జాబితాలో బలహీన వర్గాలకు చెందిన వారి పేర్లు లేకపోవడం విస్మయాన్ని కలిగించిందన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన వారి పేర్లతో కూడిన జాబితాను పంపే వరకు నియామక పక్రియను నిలుపుదల చేయాలని ప్రధాన న్యాయమూర్తి ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నిమ్మ నారాయణ తో పాటు గాలి వినోద్ కుమార్,భీమరావు,అడ్వకేట్లు భూమా గంగాధర్ గౌడ్, బైరి రాకేష్ కుమార్, లక్ష్మి నారాయణ, కమలాకర్, దున్న అంబేద్కర్, అన్నపూర్ణ, సుమిత్ర, సల్మా , శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసమే "ప్రజాపాలన" కార్యక్రమం: ఖమ్మం ఆర్డిఓ గణేష్



మధిర, డిసెంబర్ 29 బోనకల్ ప్రజా పాలన ప్రతినిధి: మండలంలో రెండవ రోజు ప్రజా పాలన కార్యక్రమం లో భాగంగా ప్రజా అవసరాలను తీర్చేందుకు ప్రజా పాలన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం ఆర్డీవో గణేష్ హాజరయ్యారు. ప్రజా పాలన రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గార్లపాడు, పెద్ద బీరవల్లి, సీతానగరం, రాపల్లి గ్రామాల లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమమును ఖమ్మం ఆర్డిఓ గణేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా అమలుపరచడానికి అర్హులైన ప్రజల నుండి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తుల స్వీకరణ జనవరి 6 వరకు అన్ని గ్రామపంచాయతీ లో తీసుకుంటారని అన్నారు. అనంతరం ఎంపీడీవో, ఎమ్మార్వో లు మాట్లాడుతూ ముందుగా నిర్ణయించిన ప్రకారం గ్రామాలలో వార్డులలో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించి ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రజల నుంచి వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదవారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం స్వయంగా ప్రజల ముంగిట్లోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఇందుకోసం కుటుంబాల నుంచి ఒకరు వచ్చి దరఖాస్తు చేస్తే సరిపోతుందని వివరించారు.అన్ని పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు .వివిధ కారణాలవల్ల గ్రామసభలో దరఖాస్తు చేసుకోలేని వారు తిరిగి గ్రామ కార్యదర్శికి దరఖాస్తు సమర్పించుకోవచ్చని తెలిపారు.దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రసీదు అందించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్, తాసిల్దార్ అనిశెట్టి పున్నమ్ చందర్, జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాలి దుర్గారావు,ఎంపి ఓ వ్యాకరణ సుబ్రహ్మణ్య శాస్త్రి,గిర్ధవర్ గుగులోతు లక్ష్మణ్, ఐకెపి సిబ్బంది ఏపిఎం యద్దనపూడి పద్మలత, సీసీలు లావూరి ఝాన్సీ భాయ్, కనకపుడి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్ దానయ్య, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.






















# జర్నలిస్టుల ఫోన్లలో పెగాసస్

- భారత్‌లో పరిణామాలపై

అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంచలన ప్రకటన



**న్యూఢిల్లీ:** పెగాసస్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. అక్టోబర్‌లో యాపిల్ నుంచి హ్యాక్ అలర్ట్‌లు వచ్చిన తర్వాత ఇద్దరు భారతీయ జర్నలిస్టుల ఫోన్లలో తాము పెగసస్ సాఫ్ట్‌వేర్‌ను గుర్తించినట్లు ఎన్‌జీవో అమ్నెస్టీ ఇంటర్నేషనల్ గురువారం ప్రకటించింది. ఎదరు జర్నలిస్టుల ఫోన్లను తమ సెక్యూరిటీ ల్యాబ్ పరీక్షించి వాటిల్లో పెగాసస్‌ను ఉన్నట్లు తేల్చినట్లు చెప్పింది. ప్రభుత్వ మద్దతుతో జరిగే హ్యాకింగ్‌కు వీరి ఫోన్లు లక్ష్యంగా మారినట్లు యాపిల్ నుంచి అక్టోబర్‌లో సందేశాలు వచ్చాయి. దీంతో వీరు తమ ఫోన్లను అమ్నెస్టీ ల్యాబ్‌కు పంపించారు. దీనిపై అమ్నెస్టీ సెక్యూరిటీ ల్యాబ్ అధిపతి డాన్చా ఒ సియార్బైల్ మాట్లాడుతూ ''జర్నలిస్టులుగా విధులు నిర్వర్తిస్తున్నందుక ు చట్టవిరుద్ధంగా వారి వ్యక్తిగత గోప్యత, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేస్తున్నారు. తమ ప్రజల మానవహక్కులను కాపాడటంతోపాటు చట్టవిరుద్ధ నిఘా నుంచి రక్షించాల్సిన బాధ్యత ప్రతి దేశంపై ఉంది'' అని పేర్కొన్నారు. అక్టోబర్‌లో యాపిల్ సంస్థ నుంచి పలువురు ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు హ్యాకింగ్ అలర్ట్‌లు వచ్చాయి. ఆ తర్వాత యాపిల్ దీనిపై వివరణ ఇస్తూ 150 దేశాలకు ఇటువంటి సందేశాలు వెళ్లాయని చెప్పింది. కానీ, అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రిక మాత్రం ప్రభుత్వమే యాపిల్‌పై ఒత్తిడి తెచ్చి ఇటువంటి ప్రకటన చేయించిందని కథనం ప్రచురించింది.

### ఇజ్రాయెల్ టెక్నాలజీ..

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో గ్రూపు పెగాసస్‌సాఫ్ట్‌వేర్ సృష్టికర్త. ఈ టెక్నాలజీనిఆ సంస్థ ప్రభుత్వాలకు మాత్రమే విక్రయిస్తుంది. భారత ఇంటిలిజెన్స్ బ్యూరో 2017లో ఎన్ఎస్‌వో నుంచి కొన్ని పరికరాలను కొనుగోలు చేసింది. అయితే ఫోన్ల హ్యాకింగ్‌ను కొట్టిపారేసిన కేంద్రప్రభుత్వం పెగాసస్ కొనుగోళ్లను మాత్రం తిరస్కరించ లేదు. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో గ్రూప్ స్పైవేర్‌తో రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలపై నిఘా పెట్టినట్లు 2021 జులైలో అంతర్జాతీయ మీడియాలో కథనాలు రావడం తీవ్ర దుమారానికి దారితీసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు రాజకీయ నాయకులు, సుప్రీం మాజీ న్యాయమూర్తి, ఇలా దేశంలో దాదాపు 300 మంది ఫోన్లను పెగాసస్‌తో హ్యాక్ చేసినట్లు అప్పట్లో కలకలం రేగింది.

## నిజ్జర్ హత్య కేసులో అరెస్టులకు రంగం సిద్ధం!

**టొరంటో:** కెనడాలో ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఖలిస్థాన్ తీవ్రవాది హత్య కేసులో ఇద్దరు అనుమానితుల్ని కెనడా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఆ ఇద్దరినీ పోలీసులు త్వరలోనే అరెస్ట్‌చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిజ్జర్ హత్యతో సంబంధం ఉన్నట్లుగా భావిస్తున్న ఇద్దరు అనుమానితులపై గత కొన్ని నెలలుగా కెనడా పోలీసులు గట్టి నిఘా పెట్టినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. భారత ప్రభుత్వం 'వాంటెడ్ టెర్రరిస్ట్' గా ప్రకటించిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ ఈ ఏడాది జూన్ 18వ తేదీన దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కెనడా లోని సర్రేలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో హర్దీప్ మరణించాడు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ సభ్యులకు కార్యకలాపాల నిర్వాహణ, నెట్ వర్క్ ఏర్పాటు చేయడం, శిక్షణ, ఆర్థిక సహకారం వంటివి హర్దీప్ చేస్తుంటాడు. పలు భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న హర్దీప్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే ఉగ్రవాదిగా ప్రకటించింది.

## దక్షిణ గాజాపై దాడులను ఉధృతం చేసిన ఇజ్రాయిల్

గాజా : ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులను ఉధృతం చేసింది. ఇప్పటికే ఇజ్రాయిల్ యుద్ధంతో గాజాలోని జనాభాలో 85 శాతం (సుమారు 2.3 మిలియన్ల ) మందిని నిరాశ్రయులయ్యారు. దక్షిణ గాజాపై వైమానిక, భూతల దాడులను తీవ్రతరం చేసినట్లు శుక్రవారం ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తెలిపింది. దీంతో నివాసాలను వీడిన వేలాది మంది పాలస్తీనియన్లు రఫా సరిహద్దుకు చేరుకున్నారని,ఈ ప్రాంతమంతా రద్దీగా మారినట్లు ఐక్యరాజ్యసమితి (యుఎన్) తెలిపింది.స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 1.20కి ఇజ్రాయిల్ డమాస్కస్ సమీపంలోని పలు ప్రాంతాలే లక్ష్యంగా వైమానిక దాడులు జరిపిందని సిరియాకి చెందిన సనా న్యూస్ ఏజన్సీ తెలిపింది. గురువారం రాత్రి చేపట్టిన ఈ దాడులతో దక్షిణాది ప్రాంతంలో ఆస్తినష్టం ఏర్పడిందని వెల్లడించింది. డమాస్కస్ విమానశ్రయంపై దాడి జరిగిందని బ్రిటన్‌కి చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ నివేదిక తెలిపింది. ఇటీవల దాడుల కారణంగా రెండు నెలల పాటు విమానాశ్రయంలో నిలిచిపోయిన సేవలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయని, అదే రోజు దాడి జరిగినట్లు పేర్కొంది. డమాస్కస్ గ్రామీణ ప్రాంతంలోని సిరియన్ ఎయిర్ డిఫెన్స్ శిబిరం మరియు దక్షిణ ప్రావిన్స్ ఆఫ్ స్వీడియాలోని సైనిక శిబిరాలపై దాడులు జరిగినట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఇద్దరు సైనికులు గాయపడినట్లు ప్రకటించింది.

# సర్వర్ డౌన్.. పబ్లిక్ పరేశాన్

- ట్రాఫిక్ పెండింగ్ చలాన్ ఆఫర్‌కు విశేష స్పందన
- మూడు రోజుల్లోనే 9.61 లక్షల చలాన్లు క్లియర్
- రూ.8.44 కోట్ల ఆదాయం




తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ట్రాఫిక్ పెండింగ్ చలాన్ డిస్కౌంట్ ఆఫర్‌కు వాహనదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. డిసెంబర్ 26న ఈ ఆఫర్ అమల్లోకి రాగా.. మూడు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 9.61 లక్షల చలాన్లు క్లియర్ అయ్యాయి. వీటి ద్వారా రూ.8.44 కోట్ల ఆదాయం సమకూరినట్లు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క హైదరాబాద్ లోనే 3.54 లక్షల చలాన్ల ద్వారా రూ.2.62 కోట్లు..సైబరాబాద్ పరిధిలో 1.82 లక్షల చలాన్ల ద్వారా 80 లక్షలు వసూలు అయ్యాయి. ఇక రాచకొండ పరిధిలో 93 వేల చలాన్లకు గాను రూ. 76.79 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వివరించారు. అయితే రాయితీ ఆఫర్‌ను పొందేందుకు వాహనదారులు భారీగా చెల్లింపులు చేయడంతో ట్రాఫిక్ చలాన్ సర్వర్ డౌన్ అవుతోంది. తరచూ సర్వర్ మొరాయిస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఇక చలాన్లు కట్టేందుకు మీ సేవ కేంద్రాల వద్ద వాహనదారులు బారులు తీరారు.

## ప్రజాపాలన కార్యక్రమం సద్వినియోగం చేసుకోండి: అద్దంకి రవి



మధిర రూరల్ డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో తొండల గోపవరం పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరుగ్యారంటీలు అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న అద్దంకి రవిఈ సందర్భంగా అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ పదేళ్లుగా అర్హులందరూ సంక్షేమ పథకాలు అమలు కాక ఎదురుచూస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రివర్యులు ఆర్థిక ప్రణాళికలు మరియు విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సారధ్యంలో ప్రతిష్టాత్మకంగా పథకాలు అమలు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన చేపట్టడం జరిగింది కావున గ్రామస్థాయి నుండి పట్టణాల వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చే అందించబడినటువంటి దరఖాస్తును పూర్తిచేసి అధికారులకు సరైన టైంలో ఇచ్చి లబ్ధి పొందాలని ఇందులో ఏ ఒక్కరి మధ్య వార్తలు గాని దళారులకు గాని అవకాశం ఇవ్వకుండా నేరుగా అధికారులు ప్రజలకు పథకాలను అందిస్తారని కావున ఏ ఒక్కరూ అపోహన పడి నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటేశ్వరరావు ప్రభుత్వ అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిసూరంశెట్టి కిషోర్‌లి మండల కాంగ్రెస్ నాయకులు లినిడమానూరు వంశీకృష్ణలి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లిధారా బాలరాజులి తొండల గోపురం గ్రామ శాఖ అధ్యక్షులు లిచేర్బోలు కృష్ణలి లినరెడ్ల వెంకటరెడ్డిలి లివాసి రెడ్డి రవికుమార్‌లి లివాసిరెడ్డి వెంకటరావు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# కమీషన్లు, కలెక్షన్లు ఉండవు

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కొడిమ్యాల :** తన పేరు చెప్పి దళారీ అవతారం ఎత్తి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ లో 34 మంది లబ్ధదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఇండ్లు అందలేదన్నారు. ఇప్పుడు అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామన్నారు. గత ఎమ్మెల్యేల మాదిరిగా ఇకపైన కమీషన్లు, కలెక్షన్లు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు. ఎవరైనా లంచాలు అడిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా మొదటి సారి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మనసు బాలేదు.. వెళ్లిపోతున్నా

రంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి:నాగోల్ మమతా నగర్ రోడ్ నెంబర్ 2 లో ఉండే ఝాన్సీ అనే మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేశారు నాగోల్ పోలీసులు.తన కూతురు జాన్సీ కనిపించడం లేదని తల్లి తండ్రులు నాగోల్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసారు. గురువారం ఉదయం తమ ఇంటికి సమీపంలో ఉండే పుట్టింట్లో తన ఇద్దరు పిల్లల్ని వదిలిపెట్టి.. ఇంటికి వెళ్ళొస్తానని బయటకు వెళ్ళింది. అలా వచ్చిన ఆమె నేరుగా ఇంటికి వెళ్ళి.. తన మనసు ఏం బాలేదని, అందరినీ విడిచి వెళుతున్నా అని, దీనికి తన భర్త నరేశ్ కు సంబంధం లేదని చెప్పి ఓ లేఖ రాసింది. ఒక బ్యాగ్ చేతిలో పెట్టుకొని వెళ్ళిపోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో తను నాగోల్ లో జెబీఎస్ బస్ ఎక్కినట్టు పోలీసులు గుర్తించారు . తనూ ఇంటి నుండి బయలు దేరిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి అని నాగోల్ పోలీసులు తెలిపారు.

# గుజరాత్‌లోనే టెస్లా ప్లాంట్

- వైబ్రెంచ్ గుజరాత్‌లో ప్రకటించే అవకాశం
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెంది విద్యుత్ కార్ల అగ్రగామి సంస్థ టెస్లా మన దేశంలో గుజరాత్‌లో తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. 2024 జనవరిలో జరిగే వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో ప్రకటించే అవకాశం ఉంది. ఎగుమతి చేసేందుకు గుజరాత్ సరైన ప్రాంతంగా టెస్లా గుర్తించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మన దేశంలో 2 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ గతంలో ప్రకటించారు. ప్లాంట్ ఏర్పాటైన తరువాత రెండు సంవత్సరాల పాటు దిగుమతి చేసుకునే వాహనాలపై 15 శాతం మాత్రమే దిగుమతి సుంకాలు విధించాలని ఎలాన్ మస్క్ కోరారు.

ఇండియాలో ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన తరువాత గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రా ల్లో ఉన్న అవకాశాలను టెస్లా బృందం పరిశీలించింది. ఈ ప్లాంట్‌లో తయారయ్యే విద్యుత్ కార్లను దేశీయ మార్కెట్‌లో విక్రయించడంతో పాటు, వివిధ దేశాలకు ఇక్కడి నుంచేఎగుమతి చేయాలని టెస్లా భావిస్తోంది. ఇందుకు అనువైన ప్రాంతంగా గుజరాత్‌ను కంపెనీ ఎంపిక చేసింది.

గుజరాత్‌లో ప్లాంట్ ఏర్పాటు చేయాలని టెస్లా నిర్ణయించడం పట్ల ప్రభుత్వ అధికార ప్రతినిధి రుషికేష్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. కంపెనీకి స్వాగతం పలికారు. ప్రత్యేకంగా ఒక కంపెనీకి దిగుమతి సుంకాల్లో రాయితీలు ఇవ్వడం కుదరదని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో టెస్లా దేశీయంగా విక్రయించే కార్లను ఇక్కడే తయారు చేయనుంది. దిగుమతి సుంకాల్లో రాయితీ ఇస్తే ఇండియాలో తయారు చేసే మోడల్స్‌తో పాటు, చైనా, జర్మనీలో తయారు చేస్తున్న మరికొన్ని మోడల్స్‌ను నేరుగా దిగుమతి చేసుకోవాలని టెస్లా భావించింది. మన దేశంలో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్‌లో తయారు చేసే కార్లలో మొదటి రెండు సంవత్సరాలు దేశీయంగా తయారు అవుతున్న 20 శాతం కంపోనెంట్స్‌ను వినియోగించనుంది. 4 సంవత్సరాల్లో ఇవి 40 శాతానికి పెంచనుంది.


ప్రస్తుతం మన దేశంలోకి దిగుమతి అవుతున్న 40 వేల డాలర్ల కంటే ఎక్కువ ఖరీదైన కార్లపై ప్రభుత్వం 100 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది. అంతకంటే తక్కువ ధర ఉన్న కార్ల దిగుమతులపై 70 శాతం దిగుమతి సుంకం విధిస్తోంది. తొలుత టెస్లా మన దేశంలో 32 లక్షల రూపాయల ధరలో లభించే మోడల్ 3, 36 లక్షల ఖరీదైన మోడల్ వై, 20 లక్షల ఖరీదులో లభించే ఒక కొత్త హాచ్‌బ్యాక్ కారును విక్రయించనుంది. ఈ కార్లు అమెరికాలో విక్రయించే ధరలు ఇండియన్ రూపాయల్లో ఉన్నాయి. దిగుమతి మన దేశం మార్కెట్‌లోకి వచ్చే సరికి వీటి ధరలు మారే అవకాశం ఉంది.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




మేడిపల్లి, డిసెంబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలనిఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు.రామంతాపూర్ డివిజన్ లోని చైతన్య భారతి ప్లే/ హై స్కూల్ లో నిర్వహించిన టాలెంట్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తయారుచేసిన నమూనాలను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చైతన్య భారతి పాఠశాల కరెస్పాండెంట్ పివి రామనర్సయ్య, హెడ్ మిస్టర్ పి లలిత రామ నరసయ్య, ప్రిన్సిపల్ రాజేందర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు, బాబు యాదవ్, సమ్మెట్ నరేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన బ్యాంకింగ్ మోసాలు




**ముంబై :** బ్యాంకింగ్ మోసాలు ఆరు సంవత్సరాల కనిష్టానికి తగ్గాయి. మోసాల్లో పోగొట్టుకున్న సొమ్ము విషయంలో 10 సంవత్సరాల కనిష్టంగా నమోదైనట్లు ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదికలో తెలిపింది. మొత్తం బ్యాంకింగ్ రంగంలో జరిగిన ఫ్రాడ్ కేసుల్లో ప్రైవేట్ రంగ బ్యాంక్‌ల్లో 66.2 శాతంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. మోసాల్లో పోయిన డబ్బు విషయంలో ప్రైవేట్ బ్యాంక్‌ల కంటే ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో ఎక్కువ మోసాలు అడ్వాన్స్‌ల విషయంలో జరిగాయి. ప్రైవేట్ బ్యాంక్‌ల్ల ఎక్కువగా కార్డులు, క్యాష్ సంబంధిత మోసాలు జరిగాయి.

2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంలో గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే బ్యాంకింగ్ మోసాలు పెరిగాయి. గత సంవత్సరం పోయిన సొమ్ములో ఈ సారి 14.9 శాతం మాత్రమే పోయిందని పేర్కొంది. వివిధ రెగ్యులేటరీ నిబంధనలు పాటించని బ్యాంక్‌లపై ఆర్‌బీఐ జరిమానాలు విధిస్తోంది.

ఈ ఆర్థికసంవత్సరం ఎక్కువగా సహకార బ్యాంక్‌లపై ఆర్‌బీఐ విధించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లపై ఈ సారి ఫెనాల్టీలు తగ్గాయి.

# ఈ ఏడాది 1.96 లక్షల కంపెనీల నమోదు

**న్యూఢిల్లీ :** ఈ సంవత్సరం నవంబర్ నాటికి దేశంలో 1.96 లక్షల కంపెనీలు, లిమిటెడ్ లయబులిటీ పార్టనర్‌షిప్ (ఎల్ఎల్‌పీ)లు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 1.88 లక్షల కంపెనీలు నమోదయ్యాయని కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సంవత్సరం కార్పోరేట్ గవర్నెన్స్, ఈజ్ ఆప్ డూయింగ్ బిజినెస్

వంటి అంశాలపై మంత్రిత్వ శాఖ సమీక్ష నిర్వహించింది. 2023 నవంబర్ 30 నాటికి దేశంలో మొత్తం 1,96,028 కంపెనీలు, ఎల్ఎల్‌పీలు ఇన్‌కార్పోరేట్ అయ్యాయి. 2023లో సెంట్రల్ ప్రాసెసింగ్ ఫర్ ఎక్సెలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (సీ-పేస్)ఈ సంవత్సరం మే నుంచి ప్రారంభమైంది. కాంపిటీషన్ చట్టంలోని కొన్ని నిబంధనలు కూడా ఈ సంవత్సరం మార్చారు. ఈ చట్టంలో చేసిన ప్రధాన సవరణల్లో విలీనాలను ఆమోదించే అధికారం రీజినల్ డైరెక్టర్లకు అప్పగించారు.

## ప్రధాని మోడీకి పోస్ట్ కార్డులు పంపిణీ




మంచిర్యాల టౌన్, డిసెంబర్ 29, ప్రజాపాలన : బీసీల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రోజు సీసీ కార్నర్ లోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్ద ప్రధాని మోడీకి పోస్ట్ కార్డులు పంపుతూ నిరసన వ్యక్తం చేసిన జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్స్ అయిన కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగే బీసీల సామాజిక రక్షణ భద్రతపై బీసీ ఆక్ట్ ఏర్పాటు, బీసీల్లో రోస్టర్ విధానం అమలు చేసి ఎస్సీ ఎస్టీ లాగే బ్యాక్ లాగ్ పోస్టులు బీసీ వర్గాలకు వర్తింపజేయాలి, రెండు లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు, బీసీ ఉద్యోగులకు పదోన్నతులో రిజర్వేషన్, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు, జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికను బహిర్గతం చేసి, న్యాయవ్యవస్థలో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోడంకి మహేష్ నాయకులు రాసమల్ల కుమార్ చంద్రగిరి చంద్రమౌళి వేముల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి దగ్గరయ్యేందుకు బీఆర్ఎస్ వ్యూహం

హైదరాబాద్, డిసెంబర్ 29, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ హిందుత్వ ఎజెండా ఎత్తుకుందా.. మొన్నటి వరకు ఎంఐఎంతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగి, సమైక్య వాదంపై స్పీచ్‌లు దంచిన నేతలు ఇప్పుడు హిందుత్వమే తమకు శ్రీరామ రక్ష అనుకుంటున్నారా.. సమైక్య వాదానికి బీఆర్ఎస్ స్వస్తి పలికిం దా.. అంటే అవుననే సమాధానం వస్తుంది గులాబీ భవన్ నుంచి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల్లో హిందుత్వానికి మద్దతుగా మాట్లాడుతున్నారు. ప్రాంతీయ వాదాన్ని వదిలేసి జాతీయవాదంపై మాట్లా డుతున్నారు. ఇందుకు తాజాగా ఎమ్మెల్సీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనం. ఇటీవల అయోధ్య రామమందిరం గురించి మాట్లాడిన కవిత, తాజాగా డీఎంకే అధినేత ఉత్తరాదివానులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సనాతన ధర్మాన్ని కించపరుస్తుందని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే నేతలు హిందువుల మనోభా వాలు దెబ్బతినేలా సనాతన ధర్మాన్ని అవమానిస్తూ మాట్లాడినప్పుడు, హిందీ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలంటూ అవహేళన చేసినప్పుడు కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత అయిన 'ఎన్నికల గాంధీ'(రాహుల్‌గాంధీ) ఎందుకు స్పందించలేదని కవిత ప్రశ్నించారు. డీఎంకే నేతల వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిజాబ్ వివాదంపై కూడా రాహుల్‌గాంధీ తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడం అని విమర్శించారు. "ఈ రోజు మనం చాలా మంది రాజకీయ నాయకుల నుంచి దురదృష్టకరమైన ప్రకటనలను చూస్తున్నాం. కొన్ని వర్గాల నుంచి ఓట్లను సంపాదిం చడానికి ఈ ప్రక్రియ చివరికి మనం ఊహించలేని విధంగా దేశాన్ని విభజించగలదు' అని పేర్కొన్నా రు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మిత్రపక్షమైన డీఎంకే పార్టీ నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా కొంత మంది నేతలు వ్యాఖ్యలు ఉన్నాయి. ఓట్ల కోసం దేశాన్ని అవమానిం చడం సరికాదు. ఇండియా కూట మికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందిం చడం లేదు. దేశాన్ని ఐక్యం చేయడానికి భారత్ జోడో యాత్ర చేశానని రాహుల్‌గాంధీ చెప్పుకుం టున్నారు. కానీ అందుకు వ్యతిరేక ంగా వారి మిత్రపక్షం చేస్తున్న వ్యాఖ్యలపై మాత్రం స్పందించడం లేదు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతినేలా సనాతన ధర్మాంపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడే సీరియస్‌గా తీసుకొని రాహుల్ గాంధీ స్పందించి ఉంటే పదేపదే ఇలా వ్యాఖ్యలు చేసి ఉండేవారు" అని కవిత అభిప్రాయపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడే పనిచేసే రాహుల్ గాంధీని అందరూ ఎన్నికల గాంధీ అని పిలుస్తారని విమర్శించారు. దేశ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని, ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేశారు. దేశానికి రాహుల్గాంధీ ఏం సందేశమిస్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల పట్ల గౌరవం ఉందని, హిందీ మాట్లాడే రాష్ట్రాలను అవమానించరాదని, హిందూ వ్యతిరేకి కాదని రాహుల్‌గాంధీ చెప్పాలని డిమాండ్ చేశా రు. కర్ణాటకలో హిజాబ్ వివాదంపై స్పందిస్తూ? ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఏవేవో హామీలు ఇస్తుందని, కానీ ఎన్నికల తర్వాత వాటిని విస్మరిస్తుందని కవిత ఆరోపించారు. హామీలను అమలు చేసి చూపించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదని స్పష్టం చేశారు. ఆ రాష్ట్రంలో గ్యారెంటీల పేరిట హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు పూర్తిగా అమలు చేయలేదని ప్రస్తావించారు. హిజాబ్‌పై నిషేధాన్ని ఎత్తివేస్తామని ఎన్నికల సమయం కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిషేధం ఎత్తివేతకు వెనుకాడుతోందని విమర్శించారు. హిజాబ్‌పై కాంగ్రెస్ వైఖరి ఏమిటో రాహుల్‌గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు.

# షావోమీ విద్యుత్ కారు ఒక్క ఛార్జ్‌తో 800 కి.మీ రేంజ్

**బీజింగ్:** చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షావోమీ గురువారం నాడు తొలి విద్యుత్ కారును ఆవిష్కరించింది. బీజింగ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కంపెనీ సీఈఓ లీ జున్ ఈ కొత్త కారును పరిచయం చేశారు. ఎస్‌యూ 7 పేరుతో ఈ కారును మార్కెట్‌లోకి కంపెనీ తీసుకురానుంది. ఈ సెడాన్ కారులో ఉన్న ఆపరేటింగ్ సిస్టమ్‌ను ప్రముఖ ఫోన్లతో అనుసంధానం అయ్యేలా రూపొందిం చారు. చైనా దిగ్గజ కంపెనీలుగా పేరున్న కాన్‌టెంపరరీ యాంపరెక్స్ టెక్నాలజీ, బీవైడీ నుంచి తీసుకున్న బ్యాటరీలను ఈ కార్లలో వినియోగిస్తున్నారు.



వచ్చే 15-20 సంవత్సరాల్లో ప్రపంచంలో తొలి ఐదు టాప్ కార్ల తయారీ కంపెనీల్లో ఒకటిగా ఉంటామని లీ జున్ ధీమా వ్యక్తం చేశారు. షావోమీ ఎస్‌యూ 7 కారును సెల్-టు-బాడీ టెక్నాలజీతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇందులో బ్యాటరీని నేరుగా వాహన నిర్మాణానికే అనుసంధానం చేసినట్లు చెప్పారు. దీని వల్ల కారు ధృఢత్వం పెరిగిందన్నారు. ఇప్పటికే కంపెనీ రూపొందించిన అనేక యాప్‌లకు ఈ కారులో యాక్సెస్ ఉంటుందని చెప్పారు.

ఈ కారు ఎస్‌యూ 7, ఎస్‌యూ ప్రో, ఎస్‌యూ 7 మ్యాక్స్ పేరుతో రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఎస్‌యూ 7 కారు 0-100 కి.మీ వేగాన్ని 5.28 సెకన్లలో అందుకుంటుంది. ఈ కారును ఒక సారి ఛార్జింగ్ చేస్తే 668 కి.మీ. రేంజ్ ఇస్తుంది. కారు గరిష్ఠవేగం గంటకు 210 కి.మీ. అత్యధికంగా 400 ఎన్ఎం టార్క్ వద్ద 299 పీఎస్ శక్తిని విడుదల చేస్తుంది. ఎస్‌యూ7 మ్యాక్స్ వేరియంట్ 2.78 సెకన్లలో 0-100 కి.మీ వేగాన్ని అందుకుంటుంది. ఈ కారు ఒక సారి ఛార్జింగ్ చేస్తే 800 కి.మీ. రేంజ్ ఇస్తుంది. ఈ కారు గరిష్ఠవేగం గంటకు 265 కి.మీ. 838 ఎన్ఎం టార్క్ వద్ద673 పీఎస్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఈ కారులో 101 కివాట్ అవర్ సామర్థ్యం ఉన్న సెల్ టూ బాడీ బ్యాటరీని అమర్చారు. కంపెనీ త్వరలోనే ఎస్‌యూవీ7 వీ8 పేరుతో 150 కి.వాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో తీసుకురానున్నట్లు తెలిపింది.

ఈ కార్ల ధరలను కంపెనీ ఇంకా ప్రకటించలేదు. వీటి ధరలు కొంచెం ఎక్కువగానే ఉంటాయని సీఈఓ లీ జున్ తెలిపారు. కారును చూసిన తరువాత కస్టమర్లు ఆ ధరకు సంతృప్తి చెందుతారని చెప్పారు. తక్కువ ఉష్ణోగ్రతల్లోనూ వేగంగా ఛార్జ్ అయ్యేలా కారును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కంపెనీ ఈ కార్లను ఎంఐ బ్రాండ్ పేరుతో తయారు చేస్తోంది. ఇండస్ట్రీలో తమదే మెరుగైన అటానమస్ డ్రైవింగ్ వ్యవస్థ ఉన్న కారని ఆయన చెప్పారు. ఈ కార్లు అక్వా బ్లూ, మినరల్ గ్రే, వెర్డంట్ గ్రీన్ రంగుల్లో లభిస్తుంది. వచ్చే 10 సంవత్సరాల్లో కార్ల తయారీపై 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని షావోమీ ప్రకటించి ంది.

# 'వ్యూహం' సినిమా సీబీఎఫ్సీ సర్టిఫికేట్ హైకోర్టు రద్దు చేయలేదు: రాంగోపాల్ వర్మ



హైదరాబాద్ 29 ప్రజాపాలన ప్రతినిధి: వ్యూహం' సినిమా సీబీఎఫ్సీ సర్టిఫికేట్ హైకోర్టు రద్దు చేయలేదు. జనవరి 11వరకు సీబీఎఫ్సీ ని సంబంధిత వివరాలు సమర్పించమని హైకోర్ట్ ఆదేశించిందని దర్శకుడు రాంగోపాల్ వర్మ వివరించారు. తదుపరి విచారణ జనవరి 11 కు హైకోర్టు వాయిదా వేసింది. 'వ్యూహం'కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్సీ) జారీని తెలుగుదేశం పార్టీ రద్దు చేయమని కోరింది. పార్టీ జెండాలు, నేతల పేర్లతో చిత్రం తీశారని, ఇది పలు పార్టీల నేతల పరువు నష్టం కలిగించేదిగా ఉందని పిటిషనర్ తరఫున న్యాయవాది మురళీధర్రావు వాదించారు. నిర్మాత-దర్శకుడి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్రెడ్డి వాదనలు వినిపించారు. రిట్ పిటిషన్ మెయింటెనబుల్ కాదు. ప్రజాప్రతినిధ్య చట్టంలోని సెక్షన్ 29(ఏ) ప్రకారం ఈ పిటిషన్ వేసే అర్హత పిటిషనర్కు లేదు. ఎవరి పరువుకు నష్టం కలుగుతుందని భావిస్తే.. వారే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి. చిత్రం చూడకుండానే పరువుకు నష్టం వాటిల్లుతుందని.. ఊహించి పిటిషన్ వేయడం ఆక్షేపణీయం. గతంలో సైరా నరసింహారెడ్డి చిత్రంపై కొందరు ఇదే హైకోర్టును ఆశ్రయించారని గుర్తు చేసారు. చిత్రం చూడకుండానే ఆరోపణలు చేయడం సరికాదంటూ పిటిషన్ను ద్వి సభ్య ధర్మాసనం గతంలో కొట్టివేసింది. నిపుణులతో కూడిన కమిటీ కూర్చొని చిత్రాన్ని చూసి ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. వ్యక్తులను, పార్టీలను కించపరిచే విధంగా ఉంటే సివిల్ కోర్టులో వారు పరువు నష్టం దావా వేసుకోవాలని అన్నారు. హైకోర్టులో వేయడం తప్పుబట్టాల్సిన అంశం పిటిషన్ను కొట్టివేయాలి అని వాదనలు సీబీఎఫ్సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ వినిపించారు. సినిమాటోగ్రాఫ్ చట్టం, ఫిల్మ్ సర్టిఫికేషన్ మార్గదర్శకాలు, ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం భావ ప్రకటన హక్కును పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ ఏకగ్రీవంగా 'యు' సర్టిఫికెట్ మంజూరు చేసిందని కోర్టు కు తెలిపారు జనవరి11 న విచారణ ఉంటుందని మాత్రమే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని అయన అన్నారు.

## శాసనసభ ఎన్నికల అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించాలి

### జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు



ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 29 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల పరిశీలకులు అనునై భాటియా తో కలిసి శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30 వ తేదీన శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగిందని, ఈ నెల 3వ తేదీన కౌంటింగ్ అనంతరం ఫలితాల ప్రకారం శాసనసభ్యులను ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ పద్యంలో ఎన్నికల సందర్భంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కొరకు చేసిన ఖర్చులను పూర్తిస్థాయిలో అందించాలని తెలిపారు. జిల్లాలోని 001-సిర్పూర్ నియోజకవర్గంలో 13 మంది, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, వీరందరూ తమ ఖర్చుల వివరాలను 2 రోజుల లోగా సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ కమిటీకి అందించాలని తెలిపారు. పార్టీలు అందించిన నిధులను పార్టీల ఖర్చులు, అభ్యర్థుల ఖర్చులలో చూపించాలని, ఇట్టి వివరాలను భారత ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే ప్రజాపాలన కార్యక్రమం



మధిర రూరల్ డిసెంబర్ 29 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో ప్రజల వద్దకే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మధ్యాహ్నం ఖాజీపురం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన ఆరు గ్యారెంటీ లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వారి ఆదేశాల ప్రకారం ప్రజల వద్దకే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటూ రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు లిసూరంశెట్టి కిషోర్‌లి, మండల నాయకులు లినిడమనూరు వంశీలి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లిదారా బాలరాజులి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లిఅద్దంకి రవిలి, హాజరయ్యారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్హులైన ప్రజలందరూ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫర్జానా బేగం ఉప సర్పంచ్ ఆయేషా కమాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కరిముల్లా మైనార్టీ నాయకులు ఫయాజ్ యూత్ నాయకులు సలీం మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రజాపాలన అప్లికేషన్లు కొనుగోలు చేయొద్దు

## వాటిని ఉచితంగానే అందజేస్తాం



**హైదరాబాద్ :** ప్రజాపాలన అప్లికేషన్లను ఎట్టి పరిస్థితుల్లో బయట కొనుగోలు చేయొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. అలా తీసుకున్నా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. 5 గ్యారంటీలకు సంబంధించిన అభయ హస్తం దరఖాస్తులకు ఎలాంటి కొరత లేదన్నారు. అందరికీ ఉచితంగానే వాటిని అందజేస్తామని వెల్లడించారు. ఎవరైనా ప్రజాపాలన అప్లికేషన్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రోనాల్డ్ రాస్ వార్నింగ్ ఇచ్చారు. పటాన్ చెరులో రూ. 20 చొప్పున ఒక్కో అప్లికేషన్ అమ్మిన మీ సేవా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు కమిషనర్ వివరించారు.



## నా సామిరంగ.. సడన్ ట్విస్ట్ ఇవ్వరుగా..?



ఇప్పుడు టాలీవుడ్ లో సంక్రాంతి సినిమాల సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. ఎన్నడూలేనంతలా ఈసారి ఐదు తెలుగు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో పోటీపడనున్నాయి. మహేశ్ బాబు గుంటూరు కారం, వెంకటేశ్ సైంధవ్, రవితేజ ఈగల్, తేజ సజ్జ హనుమాన్, నాగార్జున నా సామిరంగా సంక్రాంతి బరిలో నిలిచాయి.అయితే 2024 సంక్రాంతికి ఒక దశలో ఏకంగా అర డజను సినిమాలు షెడ్యూల్ అయ్యాయి. తర్వాత అందులోనుంచి విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ మూవీ తప్పుకుంది. కానీ మిగతా ఐదు సినిమాల్లో మాత్రం ఏదీ తగ్గేలా కనిపించడం లేదు. పక్కా సంక్రాంతికే రిలీజ్ చేస్తామని ప్రకటిస్తున్నారు మేకర్స్. దీంతో ఈ సినిమాలకు థియేటర్ల కేటాయింపు ఆషామాషీ విషయం కాదు. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్ నిర్మాతల మండలి రంగంలోకి దిగింది. సంక్రాంతి బరిలో ఉన్న ఐదు సినిమాల నిర్మాతలతో సమావేశాన్ని నిర్వహించిన దిల్ రాజు.. అవకాశం ఉన్న వాళ్లు తమ సినిమాను వాయిదా వేసుకోవాలని కోరారు. ఆ సమయంలో హనుమాన్ రిలీజ్ వాయిదా వేసుకోవాలని ఆ సినిమా దర్శక నిర్మాత ప్రశాంత్ వర్మపై దిల్ రాజు ఒత్తిడి తెచ్చినట్లు వార్తలు వచ్చాయి. కానీ తాము మాత్రం పక్కాగా జనవరి 12వ తేదీనే హనుమాన్ ను రిలీజ్ చేస్తామని ప్రశాంత్ వర్మ స్పష్టం చేశారట. ఇప్పటికే ప్రచారం కూడా ప్రారంభించామని, నార్త్ ఇండియా రిలీజ్ ను వదులుకోలేమని తెలిపారట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు సినీవర్గాల్లో మరో వార్త చక్కర్లు కొడుతోంది. ఇప్పటి వరకు నాగార్జున నా సామిరంగా సినిమా ఫైనల్ కాపీ ఇంకా రెడీ అవ్వలేదట. ఓటీటీతోపాటు శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా ఇంకా కుదరలేదట. వీటన్నంటికీ ఇంకా టైమ్ పడుతుందట. అందుకే రిలీజ్ ను వాయిదా వేసుకోవాలని మిగతా డిస్ట్రిబ్యూరీటర్లు సూచిస్తున్నారట.డెవిల్ అయితే సోగ్గాడే చిన్నినాయనా, బంగార్రాజు వంటి సినిమాలతో సంక్రాంతి సెంటిమెంట్ ను బాగా వాడుకున్న నాగార్జున.. ఇప్పుడు ఈ మూవీ రిలీజ్ వాయిదాకు ఒప్పుకోరని టాక్ వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి. ఇక ఈ సినిమా విషయానికొస్తే ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నాగార్జున సరసన ఆషిక రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తున్నారు. యంగ్ హీరోలు అల్లరి నరేశ్, రాజ్ తరుణ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. చిట్టూరి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

## యాక్షన్ ఎంటర్‌టైనర్



యువచంద్ర కృష్ణ, బేబి తనస్వీ, అనన్య నాగళ్ల

తొలి ఇండిపెండెంట్ చిత్రం 'ఐంధం రేగడ్' తో విమర్శకుల ప్రశంసలు పొందిన దర్శకుడు సాహిత్ మోత్ఖూరి రెండో చిత్రం 'సవారీ' తో బాక్సాఫీస్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు తన మూడవ చిత్రంతో రాబోతోంది. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ చిత్రంలో యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి 'పొట్టేల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను పెట్టారు. ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ ద్వారా టైటిల్ ని లాంచ్ చేశారు. ఈ ఫస్ట్ ఇంపాక్ట్ ఈవెంట్‌లో దర్శకుడు సాయి సాహిత్ మోత్ఖూరి మాట్లాడుతూ "యువ చంద్ర ఈ చిత్రంతో నటుడిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటాడు. అనన్య కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చింది.. ఈ సినిమా ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది"అని అన్నారు. నిర్మాత నిశాంక్ మాట్లాడుతూ "ఈ సినిమాతో సాహిత్ రూపంలో ఒక గొప్ప దర్శకుడు రాబోతున్నాడు. అందరూ గర్వపడే సినిమా తీశాడు"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సురేష్, ప్రణయ్ రెడ్డి వంగా, యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల పాల్గొన్నారు.




## ఎలా ఉంది ఎల్లో!

జూనియర్ సమంతగా పేరు తెచ్చుకున్న నటి అషు రెడ్డి. ఈ అమ్మడు చాలా తక్కువ సమయంలోనే బుల్లితెరపై సందడి చేసింది. బిగ్ బాస్ లో ఈ బ్యూటీ ఎంట్రీ ఇచ్చిన తర్వాత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైంది. బిగ్ బాస్ తర్వాత సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయిన ముద్దుగుమ్మ అషు రెడ్డి సినిమాల్లో కూడా వరుసగా నటిస్తూ వచ్చింది. అయితే వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్‌కు ఓకే చెప్పకుండా స్లోగానే సినిమాలు చేస్తోంది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫొటోలు షేర్ చేసే అషు రెడ్డి మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. అందమైన అషు రెడ్డి ఈసారి ఎల్లో డ్రెస్ లో మరింత అందంగా కనిపిస్తూ నెటిజెన్లతో వావ్ అనిపించుకుంటోంది. అషు రెడ్డి ఇంత అందంగా ఉన్నా కూడా తెలుగు అమ్మాయి అవ్వడం వల్ల సినిమాల్లో హీరోయిన్ గా ఆఫర్లు పెద్దగా రావడం లేదనే వాదన కూడా ఉంది. ఇతర భాషల్లో అషు రెడ్డి ప్రయత్నిస్తే తప్పకుండా ఆఫర్లు చాలానే వస్తాయనే అభిప్రాయం కూడా మరోవైపు ఉంది. అషు ఆ దిశగా ఏమైనా ప్రయత్నాలు చేస్తుందా చూడాలి.

## యాక్టర్ కావాలనేది నా కల

- బబుల్‌గమ్ హీరో రోషన్ కనకాల



ప్రముఖ యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం బబుల్‌గమ్. రవికాంత్ పేరేపు దర్శకుడు. మానస చౌదరి హీరోయిన్. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకువస్తోంది. ఈ సందర్భంగా రోషన్ కనకాల విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు.

- చిన్నప్పటి నుంచి నటుడు కావాలనేది నా కోరిక. కథానాయకుడిగా చేయలనే కోరిక వుండేది. దర్శకుడు రవికాంత్ ని కలవడం, ఆయనకి నాతో సినిమా చేయాలని అనిపించడంతో ఈ ప్రయాణం మొదలైయింది.
- నా బాల్యం అంతా దాదాపుగా తాతగారి యాక్టింగ్ స్కూల్లోనే గడిచింది. దాని ప్రభావం నాపై ఉంది.
- నటనలో తాతగారి దగ్గర శిక్షణ తీసుకున్నాను. తర్వాత లాస్ ఏంజలెస్, పాండిచ్చేరిలో కోర్స్ చేశా.
- రవికాంత్ నేను.. నెల ముందు వర్క్ షాప్ చేసుకున్నాం, అందుకే సెట్ పైకి వచ్చినపుడు న్యూ కమ్మర్‌లా అనిపించలేదు.
- వర్క్ షాప్ చేసిన తర్వాత షూటింగ్ మొదలుపెట్టాలని ముందే నిర్ణయించుకున్నాం. రిహార్సల్ చేసుకున్నాం. ప్రిపరేషన్ చాలా హెల్ప్ అయ్యింది.
- నేను ఎలా రియాక్ట్ అవుతాను..ఇలా కొన్ని ఇన్పుట్స్ తీసుకున్నారు.
- ఇజ్జత్ పాట లాంచ్ చేయడానికి చిరంజీవి గారిని కలిశాం. మా సినిమా కాన్సెప్ట్ ఇజ్జత్ ఇచ్చిపుచ్చుకోవడం. సాంగ్ లాంచ్ సమయంలో వారి జీవితంలో ఎదురైన అనుభవాలు గురించి చెప్పారు. అలాగే బిగ్ బాస్ కి వెళ్ళినపుడు నాగార్జున గారితో వీడియో చేశాం. మొదట ఆడియో రికార్డ్ కాలేదు. ఆయన్ని అడిగితే .. మరోసారి చేశారు. అది చాలా గొప్పగా అనిపించింది.
- మా నిర్మాతలు. విశ్వప్రసాద్ గారు, వివేక్ గారు చాలా సపోర్ట్ చేశారు. బలంగా నమ్మారు. ఏ ఇబ్బంది లేకుండా ప్రతిది సమకూర్చారు.

## గేమ్ చేంజర్" కోసం చరణ్ డెడికేషన్.!

గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇండియన్ జేమ్స్ కేమరూన్ శంకర్ దర్శకత్వంలో చేస్తున్న మాసివ్ పాన్ ఇండియా పొలిటికల్ యాక్షన్ డ్రామా చిత్రం "గేమ్ చేంజర్" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ భారీ చిత్రం రిలీజ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ చిత్రం షూటింగ్ మాత్రం గత కొన్నాళ్ల నుంచి అలా కొనసాగుతూ వస్తూనే ఉంది. మరి ఈ షూట్ చేసిన కొన్ని కామెంట్స్ ఫ్యాన్స్ లో వైరల్ గా మారాయి.ఓ ప్రముఖ మ్యాగజైన్ లో చరణ్ మాట్లాడుతూ తాను ప్రస్తుతం చేస్తున్న సినిమాకి గత వారం రోజులు కూడా ప్రతీ రోజు 16 గంటలు వర్క్ చేయాల్సి వచ్చింది అని తెలిపాడు. అలాగే తనకి షూటింగ్ కి పర్ఫెక్ట్ సమయానికే సెట్స్ లో ఉండేందుకు ఇష్టపడతాను అని కూడా తెలిపాడు. దీనితో ఈ సినిమా పట్ల రామ్ చరణ్ ఎంత డెడికేషన్ తో వర్క్ చేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ అవైటెడ్ సినిమాకి దిల్ రాజు నిర్మాణం వహిస్తుండగా వచ్చే ఏడాది సెప్టెంబర్ రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు.

## సలార్ మొదటి భాగాన్ని మించేలా రెండవ భాగం



- శ్రియా రెడ్డి

ప్రభాస్ నటించిన 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్' అంటే ద్వితీయ భాగం ఇంకాచాలా బాగా ఉంటుందని ఈ చిత్రంలో నటించిన శ్రియారెడ్డి అంటోంది. డిసెంబర్ 22న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇందులో రాధారమ పాత్రలో నటించిన శ్రియా రెడ్డి సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు మీడియాకు తెలియజేశారు.

- దర్శకుడు ప్రశాంత్ నీల్ సలార్ సినిమా గురించి చెప్పినప్పుడు తొలుత నటించేందుకు ఆసక్తి చూపించలేదు. కారణం ఆ సమయంలో సినిమాల్లో నటించకూడదని అనుకున్నా. ప్రశాంత్ మాత్రం వదల్లేదు. నటించాలన్నారు. చివరికి హీరో ఎవరైనా ఫరవాలేదు నా పాత్రకి ప్రాధాన్యత ఉండాలని ఆయనకు చెప్పాను.
- విలనిజం టచ్ ఉంటూనే అందంగా కనిపించేలా నా పాత్రనుడి డిజైన్ చేశారు.
- రాధారమ పాత్ర లుక్ ఏ విధంగా ఉండాలని చర్చించాం. వెండి ఆభరణాలు చేయించారు. టాటూ కూడా ఉండాలని అనుకున్నాం. నన్ను ఎంపికచేయడానికి పొగరు సినిమాలో నా పాత్ర చూడడమే అని ప్రశాంత్ చెప్పారు.
- ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. చాలా కూల్‌గా తన పని తాను చేసుకుంటూ పోతారు. పృథ్వీరాజ్ కూడా అంతే.
- సలార్ మొదటిభాగంలో నా పాత్ర పెద్దగా కనిపించదు. సెకండ్ పార్ట్‌లో ఎక్కువగా కనిపిస్తాను. మొదటి భాగాన్ని మించేలా రెండవ భాగం ఉంటుంది.
- పవన్ కల్యాణ్ ఓజీ అద్భుతమైన స్క్రిప్ట్. ఇందులో నెగిటివ్ పాత్ర మాత్రం చేయడం లేదు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989